
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

సోమవారం 26 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.1	29.3
కావలి	36	28
ఆత్మకూరు	36	26
ఉదయగిరి	35	27
కందుకూరు	34	28



జొన్నవాడ వీధుల్లో సాగుతున్న కామాక్షితాయి రథోత్సవం, (అంతర్‌చిత్రంలో) రథంలో కొలువుదీరిన గంగ, కామాక్షి సమేత మల్లికార్జునస్వామి



అంగరంగ వైభవంగా

కామాక్షితాయి రథోత్సవం

- హరనామ స్మరణతో మారుమోగిన జొన్నవాడ
- తేరు ఎదుట టెంకాయలు కొట్టి, హారతులిచ్చిన భక్తులు
- బ్రహ్మోత్సవాల్లో నేడు కల్యాణోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం,మే25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గంగ, కామాక్షి సమేత మల్లికార్జునస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తేరుపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చగా, పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉత్సవవిగ్రహాలను మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై ఆశీనులు చేశారు. అనంతరం రథోత్సవం ఆద్యంతం భక్తుల హరనామ స్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా భక్తులంతా రథం ముందు టెంకాయలు కొట్టి, హారతులు పట్టారు. ఈ సందర్భంగా పలువురు రథంపై మిరియాలు, ఉప్పు చల్లారు. ముందుగా స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచు రథం తిరిగే వీధులను శుభ్రం చేయించి, ట్యాంకర్‌తో నీళ్ల చల్లించారు.

● మజ్జిగ, మంచినీరు పంపిణీ

పలు సామాజిక వర్గాలవారు, స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులు రథం లాగిన భక్తులకు మంచినీళ్ల, మజ్జిగ, పానకం, ఇతర శీతల పానీయాలను ఉచితంగా పంపిణీ చేశారు. దాతల సహకారంతో పులిహోర, దద్దోజనం, ప్రసాదాలు అందచేశారు. జొన్నవాడకు వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. రాత్రికి స్వామి,అమ్మవార్లు గజ, సింహ వాహనాలపై వేర్వేరుగా జొన్నవాడ ఆలయం నుంచి పెనుబల్లికి ఊరేగింపుగా వెళ్లారు. సోమవారం ఉదయం అక్కడి నుంచి ఆడపడుచు లాంఛనాలతో తిరిగి ఆలయానికి చేరుకోను న్నారు. కాగా స్వామి,అమ్మ వార్లకు సోమవారం కల్యాణోత్సవం నిర్వహించను న్నారు. ఈ కార్యక్రమా నికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకోసం అన్నీ వసతులతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సేవా కమిటీ చైర్మన్ టీ. అశోక్‌రెడ్డి, ఆలయ ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి తెలిపారు.



తేరు ముందు టెంకాయలు కొట్టి హారతులిస్తున్న భక్తులు

నేటి నుంచి ఎంఆర్ టీకాలు

- తట్టు, పొంగు వ్యాధుల నివారణే ధ్యేయంగా..
- వ్యాక్సిన్ వేయించుకోని ఐదేళ్లలోపువారే లక్ష్యం
- మూడు రౌండ్లలో 100 శాతం లక్ష్యసాధన
- ఇప్పటికే జిల్లాలో ఐదు తట్టు కేసుల గుర్తింపు

నెల్లూరు (వైద్యం) మే 25 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక టీకాల వల్ల ఎలాంటి ప్రాణాంతక వ్యాధులు రాకూదని రాష్ట్ర ప్రభుత్వం బావిస్తోంది. ఈ క్రమంలో జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పని సరిగా ఆయా టీకాలు వేయాలని ఆదేశించింది. అయితే 2024లో 18 తట్టు(మీజుల్లా) కేసులు నమోదు కాగా, 2025 ఇప్పటి వరకు ఐదు తట్టు కేసులు నమోదయ్యాయి. ఈ సమస్య ఎక్కువగా సంచార జాతుల కుటుంబాల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరి కుటుంబాల్లోని చిన్నారులకు ఎంఆర్ (మీజుల్లా, రూబెల్లా) టీకా వేయాలని నిర్ణయించింది.

● నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్

ఈనెల 26 (సోమవారం) నుంచి జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఈనెల 31 వరకు కొనసాగిస్తారు. రెండో రౌండ్‌లో జూన్ 23 నుంచి 28 వరకు ప్రత్యేక శిబిరాల ద్వారా ఎంఆర్ టీకాలు వేస్తారు. మూడో రౌండ్‌లో జూలై 21 నుంచి 26 వరకు ఈ టీకాలు వేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కాగా ఈనెల 18 నుంచి 23 వరకు వైద్య ఆరోగ్యశాఖలోని వ్యాధినిరోధక టీకాల విభాగం వారు ప్రత్యేక సర్వే నిర్వహించి, 226 సమస్యాత్మక ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, ఇటుక బట్టీలు, రొయ్యల గుంటలు, మురికి వాడలను గుర్తిం చారు. ఆయా ప్రాంతాల్లో ఈ టీకాలు వేయాలని నిర్ణయించారు.. పట్టణ ప్రాంతాల్లో 96 మంది, గ్రామీణ ప్రాంతాల్లో 64 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు.



● ఐదేళ్లలోపువారు 1.72 లక్షలమంది

జిల్లావ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారులు 1.72 లక్షల మంది ఉన్నారు. వీరిలో ఎంతమంది ఎంఆర్ టీకాలు వేయించుకున్నారో తెలియదు. వైద్య ఆరోగ్యశాఖ టీకాల విభాగం మాత్రం 97 శాతం టీకాలు పూర్తి చేశామని చెబుతోంది. అయితే గిరిజన ప్రాంతాలు, రొయ్యలగుంటలు, సంచార కుటుంబాలలో టీకాల వేయించుకోని వారిశాతం ఎక్కువగా ఉంది. ఈ లెక్కన పూర్తిస్థాయి సర్వే నిర్వహిస్తే మరింత మందిని గుర్తించే అవకాశం ఉంది.

100 శాతం ఎంఆర్ టీకాలు పూర్తిచేస్తాం



జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులకు ఎంఆర్ టీకాను 100 శాతం వేసేలా చర్యలు తీసుకుంటు న్నాం. టీకాలు వేయించుకోని చిన్నారులను ఇప్ప టికే గుర్తించాం. వారందరికి టీకాలు వేస్తాం.

- డాక్టర్ ఉమామహేశ్వరి, వ్యాధి నిరోధక టీకాల అధికారి

రైతులకే పనులు

- ఇరిగేషన్ వర్క్సు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం
- రూ.10 లక్షల వరకు సాగునీటి సంఘాలకే...
- టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలోనే...
- కాలువల నిర్వహణలో బాధ్యత పెంచేందుకే..

నెల్లూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఏ కాలువను బాగు చేస్తు న్నారో.. ఏ కాలువను బాగు చేసినట్లు చూపించి, బిల్లులు పెట్టుకున్నారో...? రైతులకు తెలిసేది కాదు. వైసీపీ నేతలు బినామీలను పెట్టుకొని, కాలువల నిర్వ హణ పనులు చేయకుండానే చేసిన ట్లుగా చూపించి రూ.కోట్లు స్వాహా చేశారు. నాడు మరొకరిని టెండర్ వేయనీయకుండా ఒక్కో నియో జకవర్గంలో ఒక్కరికే గంపగుత్తగా పనులు కట్టబెట్టారు. ఆఖరుకు చిన్న చిన్న పనులను కూడా ప్యాకేజీలుగా మార్చి దోచిపెట్టారు.

● సాగునీటి సంఘాలకే పనులు

అయితే గత ప్రభుత్వ అక్రమాలను గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం.. ఇకపై అలాంటి వాటికి ఆస్కారం లేకుండా పకడ్బందీ నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఇటీవల సాగునీటి సంఘాలకు ఎన్నికలు పూర్తి చేసింది. ఇప్పుడు కాలువల నిర్వహణ పనులను కూడా ఆ సంఘాలకే అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ సాగునీటి సంఘాలు తమ పరిధిలోని రూ. 5 లక్షల్లోపు ఉన్న చిన్నచిన్న మెయింటెనెన్స్ పనులను మాత్రమే నామినేషన్ పద్ధతిలో చేస్తుండేవారు. ఇకపై ఆ పరిధిని రూ.10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాలువల మెయింటెన్స్ పనులు దాదాపుగా రూ.10 లక్షల్లోపే ఉంటాయి. దీంతో ఇకపై కాలువల నిర్వహణ మొత్తం సాగునీటి సంఘాల చేతుల్లోకి రానుంది.



● త్వరగా పనులకు అవకాశం

ఏటా రెండు సీజన్లలోనూ కాలువల్లో ఓఅండ్ఎం పనులు చేస్తుంటారు. కాలువల్లో పూడికతీయడం మొదలు షట్టర్లకు మరమ్మతులు చేయడం వరకు చేస్తుంటారు. వీటిలో సింహభాగం పనులు రూ.5 లక్షల పైనే ఉంటుండడంతో ఇరిగేషన్ అధికారులు టెండర్లు పిలుస్తున్నారు. అయితే ప్రక్రియ జరగడానికి నెల సమయం పడుతోంది. టెండర్లు పిలవడం, వాటిని ఓపెన్ చేయడం, కాంట్రాక్టర్‌తో అగ్రిమెంటు చేయడం, ఆ తర్వాత కాంట్రాక్టర్‌తో పనులు మొదలు పెట్టించడం.. వంటి ప్రక్రియలు ఉన్నాయి. అయితే కొంతమంది కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు. దీనిపై రైతు సంఘాల నేతలు అధికారులకు ఫిర్యాదులు చేసేవారు. అయితే ఇప్పుడు రూ. 10 లక్షల్లోపు పనులన్నీ సాగునీటి సంఘాల పరిధిలోకి రావడంతో పనులు త్వరగా జరిగే అవకాశం ఉంది. కాలువల్లో పూడికతీత, కాలువ గట్లకు మరమ్మతులు, రివిట్‌మెంట్ చేయడం, షట్టర్లకు మరమ్మతులు చేయడం, గేట్లకు రంగులు వేయడం, అత్యవసరంగా చేయాల్సిన పనులు, ఇన్స్‌పెక్షన్ పాత్‌లను మెయింటెన్ చేయడం వంటి పనులన్నీ సాగునీటి సంఘాల పరిధిలోకి వచ్చాయి.

● అంతా రైతులే...

ప్రస్తుతం జిల్లాలో 486 సాగునీటి సంఘాలు(డబ్ల్యూఏ) ఉండగా వాటిల్లో 3649 మంది టెరిటోరియల్ కాన్స్టియన్సీ (టీసీ) సభ్యులుగా ఉన్నారు. అలానే మరో 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఐదు ప్రాజెక్టు కమిటీలు కూడా ఉన్నాయి. ఈ కమిటీల్లో ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు, సభ్యులంతా ఆయా పరిధిలోని రైతులే కావడం గమనార్హం. వీరి పరిధిలోని కాలువల నిర్వహణకు ఏ పని మంజూరైనా ఈ సభ్యులందరికీ తెలుస్తుంది. కాబట్టి కచ్చితంగా నాణ్యతగా పనులు జరుగుతాయని ఇరిగేషన్ అధికారులు భావిస్తు న్నారు. తద్వారా సాగునీటి సంఘాలపై బాధ్యత పెంచడమే కాకుండా కాలువల మెయింటెనెన్స్ కూడా సమర్థవంతంగా జరుగుతుందని వారంటు న్నారు.


ఎడగారులో 'ఎంటీయూ'కి యమా గిరాకీ

- వెతుక్కుంటూ వచ్చి కొనుగోళ్లు
- రబీ అనుభవంతో పెరిగిన సాగు విస్తీర్ణం
- బోరుగులు, అటుకుల తయారీకి ఈ రకం ఎగుమతి
- పూర్వవైభవం వచ్చిందంటున్న రైతులు

నెల్లూరు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎంటీయూ 1010 రకం ధాన్యం ఒకప్పుడు ఎడగారు సాగులో తొలి ప్రాధాన్యత కలిగిన రకం. కాలక్రమేణా పోటీ వరి వంగడాలు వచ్చేసరికి దీన్ని రైతులు పూర్తిగా మర్చిపోయారు. ఇటీవల ఈరకం ధాన్యం బొరుగులు, అటుకుల తయారీలో బాగా గుర్తింపు తెచ్చుకుంది. దీంతో వ్యాపారులు ఈ రకం సాగుచేసిన ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. గత రబీలో పొదలకూరు మండలం తాటిపర్తిలో ఓ రైతు 15 ఎకరాల వరకు ఎంటీయూ రకం సాగు చేశారు. కోతల సమయంలో వ్యాపారులు పోటీపడి మరీ కొనుగోళ్లు చేశారు. ఈ రకానికి ప్రాధాన్యం పెరగడంతో తాజాగా ఎడగారులో తొలి,మలి ప్రాధాన్యం ఉన్న ఈరకం వంగడం రెండో స్థానానికి చేరుకుంది.

● మళ్లీ తెరపైకి..

ఎడగారులో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు అప్పట్లో వ్యవసాయ శాస్త్రవేతలు ఎంటీయూ 1010 (లావులు) రకాన్ని రూపొందించారు. దీన్ని ఎడగారులో తొలి ప్రాధాన్యతా క్రమంలో రైతులు సాగు చేసుకుంటూ వచ్చారు. బీపీటీ, ఎన్ఎల్ఆర్, తాజాగా కేఎన్ఎంలు పోటీ వరి వంగడాలుగా మారడంతో ఎంటీయూ రకానికి గిరాకీ తగ్గింది. ఈ క్రమంలో ఎడగారులోనూ సాగుచేసేవారు లేకుండాపోయారు. దాదాపుగా ఈ వంగడాన్ని రైతులు మర్చిపోతున్నార నుకునే సమయానికి మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటు సాగులో చీడపీడలను తట్టుకునే శక్తి దీనికి ఉండటం, బొరుగులు, అటుకల తయారీకి ఈ రకం ప్రత్యేకమైందని కావడంతో వ్యాపారులు పండిన ధాన్యాన్ని పండినట్లుగా కొనుగోలు చేస్తున్నారు. రబీలో ఈ రకాన్ని అక్కడక్కడా అతి తక్కువమందే సాగు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన వ్యాపారులు వరికోతల వద్దకు వచ్చి మంచి ధర చెల్లించి తీసుకెళ్లారు. దీంతో తాజాగా ఎడగారులో కేఎన్ఎం రకాన్ని తొలి ప్రాధాన్యంలో సాగు చేసినా, రెండో ప్రాధాన్యంలో ఎంటీయూ రకాన్ని సాగులోకి తీసుకు వస్తున్నారు. నెల్లూరుకు పడమరన ఉన్న గ్రామాల్లో ఈ వంగడాన్ని ఎక్కువమంది సాగు చేసేందుకు నార్లుపోశారు. అక్కడక్కడా నాట్లు కూడా కూడా వేస్తున్నారు.



వరినాట్లు వేస్తున్న కూలీలు

● పెరగిన డిమాండ్

రబీలో ఎంటీయూ రకాన్ని తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన రైతులు పుట్టి రూ. 20 వేల వరకు అమ్మారు. అంతకుముందు పుట్టి రూ. 16 వేలకు కొనుగోలు చేస్తే గొప్ప. కానీ తాజాగా ఎడగారు సీజన్‌లో ఒక్కసారిగా ఈ రకానికి గిరాకీ పెరగడంతో నెల్లూరు రూరల్లోని పూర్తి విస్తీర్ణంలో రెండో ప్రాధాన్యపంటగా ఈ రకాన్ని సాగు చేస్తున్నారు. రబీలో వచ్చే ధర కంటే అదనపు ధర దక్కుతుందని రైతులు ఆశిస్తున్నారు. వ్యాపారులే గ్రామాలకు వచ్చి నేరుగా కొనుగోలు చేస్తుండటంతో ఎంటీయూ 1010 రకానికి పూర్వ వైభవం వచ్చినట్లుగా రైతులు చెప్పుకుంటున్నారు.

'ఉపాధి' ఉద్యోగుల ఎదురుచూపులు

ఉద్యోగోన్నతులు ఎప్పుడో..?

పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే..

సంగం, (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఏళ్ల తరబడి ఉద్యోగోన్నతి కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వీరిని ఏమాత్రం పట్టించుకోలేదు. పదోన్నతులతో పాటు పీఆర్‌సీని కూడా పక్కనపెట్టింది. ఈ నేపథ్యంలో వారు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

గత పాలకుల కాలయాపన

ఉపాధి హామీ పథకంలో డ్వామా ఉద్యోగులు 19 నుంచి 23 ఏళ్లగా పనిచేస్తున్నారు. గత వైసీపీ ప్రభు త్వం పీఆర్‌సీ ప్రకారం 23 శాతం జీతాలు పెంచకపోగా, పదోన్నతులు కూడా కల్పించలేదు. వీరితో పాటు చేరినవారికి తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం టైం స్కేల్ అమలు చేసింది. వైసీపీ పాలకులు మాత్రం అదిగో... ఇదిగో.. అంటూ ఐదేళ్లపాటు కాలయాపన చేశారు.

పదోన్నతులకు అర్హులే..

ప్రస్తుతం ఉపాధి పథకంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అత్యున్నత పరిజ్ఞానంతో ప్రజలకు అవగాహన కల్పించడం, అమలు పరచడం, పర్యవేక్షణ చేయడం, పరిపాలనాపరమైన అంశాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధి హామీ ఉద్యోగులు అన్నీ క్యాడర్లలోనూ పదోన్నతులకు అర్హులేనని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తున్నది. కానీ పదోన్నతులకు అవకాశం కల్పించడం లేదు. ప్రతి గ్రామంలోనూ గ్రావెల్, టీటీ, సిమెంట్ రోడ్లు, సచివాలయ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్త్రీ శక్తి, రైతు సేవా, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల ప్రహరీగోడల నిర్మాణం, ఇతర మౌలిక వసతులు కల్పించడంలో ఉపాధి హామీ పథకం ఉద్యోగుల భాగస్వామ్యం ఎంతో ఉంది. అలాగే అటవీ, వ్యవసాయ, పంచాయతీరాజ్, విద్య వైద్య, జలవనరులు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ తదితర శాఖల సమన్వయంతో రైతు సంక్షేమ పథకాలు ఉపాధి హామీ పథకం ద్వారానే జరుగుతున్నాయి.

నేటి ప్రభుత్వంపైనే ఆశలు


ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న కూటమి ప్రభుత్వంపైనే వారంతా ఆశలు పెట్టుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను సాంకేతిక సహాయకులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పదోన్నతులు కల్పించాలి. అలాగే సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ ఇంజనీర్లకు ఎంటీసీలకు అదనపు కార్యక్రమ అధికారుల (ఏపీవో)గానూ, హెచ్‌ఆర్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పించాలని వారు కోరుతున్నారు. అంతేకాక ఫుల్ టైం ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఈ)కు గ్రామీణాభివృద్ధి శాఖలో 70 శాతం పదోన్నతులు కల్పించాలనే డిమాండ్ ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖలో శ్రీ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఎస్ఆర్‌డీఎస్) కింద పనిచేస్తున్న ఎఫ్‌టీఈల నియామకం తేదీ, తదితర పొరపాట్లను సరిదిద్దాలని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులను ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని వారు కోరుతున్నారు.



సంగంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయం

జిల్లా అంతటా వర్షం

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) మే 25 : నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం నుంచి ఎండకాయగా, రాత్రి పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రానున్న రెండు, మూడు రోజులు కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ ప్రకటించింది. అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం రెండో పంట సాగు మొదలయిన తరుణంలో వర్షాలు కురుస్తుండటం రైతాంగానికి కలిసి వచ్చింది. కాగా నెల్లూరు నగరంలో కురిసిన వర్షానికి పలు లోతట్టు ప్రాంతాల్లోనూ, రోడ్లపైన నీరు నిలిచింది.



ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో ఉదయగిరి బస్టాండ్‌లో నిలిచిన నీరు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 510

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9260
వెండి కిలో ధర	రూ.100,600
వెండి ఒక గ్రాము	రూ.103.60

కల్లూరుపల్లిలో గోశాల ప్రారంభం

నెల్లూరు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం నూతన గోశాలను ప్రారంభించారు. స్థానిక సరస్వతి శివరామమందిరం ప్రాంగణంలో చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి నిలయం పేరిట గోశాలను నిర్మించారు. నాగరాజశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు విశేష పూజలు, చండీ హోమము నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జంగా శివకుమార్, ఆర్‌వీఎస్వీ ప్రసాదరావు, నాయకులు రాఘవేంద్ర, అరవ శీను తదితరులు పాల్గొన్నారు.

31న ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), మే 25 (ఆంధ్రజ్యోతి) : సినీ, రాజకీయ రంగాలలో రారాజుగా వెలుగొందిన నందమూరి రామారావు జయంతి ఉత్సవాల సందర్భంగా ఈనెల 31న ఎన్టీఆర్ పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు సింహపురి ఆర్ట్స్ క్రియేషన్స్, సితార ఎంటర్ టైన్‌మెంట్ నిర్వాహకురాలు లావణ్య తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. టౌనుహాలులో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా డ్యాన్సు, సినీ పాటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి ఎన్టీఆర్ సేవారత్న పురస్కారాలు అందిస్తామని తెలిపారు.

కారు ఢీకొని ఒకరి మృతి

నెల్లూరు రూరల్, మే 25,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - మైపాడు రహదారిపై నారాయణరెడ్డిపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు.. ఇందుకూరుపేట మండలం ఈదూరు గ్రామానికి చెందిన మోచర్ల శరత్ (38) ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఆదివారం స్కూటర్‌పై నెల్లూరు వస్తుండగా నారాయణ రెడ్డిపేట వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడిక్కడే మృతి చెందాడు. శరత్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదరాజుగూడూరులో గడ్డివామి దగ్ధం

నెల్లూరు రూరల్, మే 25,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదరాజు గూడూరులో ఆదివారం వరి గడ్డివామి దగ్ధమైంది. గ్రామస్థుడు బోనుబోయిన వెంకటేశ్వర్లుకు చెందిన సుమారు 10 ఎకరాల గడ్డి అగ్నికి ఆహుతైంది. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలియదు కాని గడ్డికి నిప్పు అంటుకోవడంతో మంటలు తలెత్తాయని, అగ్నిమాపక దళం వచ్చి మంటలు ఆర్పినట్లు ఆయన తెలిపారు.

చెన్నై ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో వైద్య శిబిరం

నెల్లూరు (వైద్యం), మే 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఆదివారం వైద్య శిబిరం జరిగింది. దీనిని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించి నిర్వాహకుడు రమేష్‌బాబును అభినందించారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, కీళ్ల ఎముకల వ్యాధుల డాక్టర్ నిఖిల రెడ్డి, చర్మవ్యాధుల డాక్టర్ ఇందిర, దంత వైద్యుడు రవి, డాక్టర్ రాజరాజేశ్వరి తదితరులు రోగులకు వైద్య సేవలు అందించారు.



విఘ్నేశ్వరుడికి మామిడి రసాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), మే 25 (ఆంధ్రజ్యోతి) : మాస శివరాత్రి సందర్భంగా లోక కల్యాణార్థం ఆదివారం పప్పులవీధి సిద్ధి విఘ్నేశ్వరస్వామికి మామిడి పండ్ల రసంతో అభిషేకం చేశారు. గణపతి పూజ, పుణ్యాహ వచనం, విశేష పుష్పాలంకారం, భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగాయి. అర్చకుడు మాచవోలు కోటేశ్వరశర్మ, ఆలయ పాలక మండలి, పాండురంగ అన్నదాన సమాజం పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.



'తల్లికి పాదాభివందనం'

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : బ్రహ్మ సృష్టిలో అమ్మకుమించిన అపురూపం మరొకటి లేదని, జన్మనిచ్చిన అమ్మ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి సతీమణి సుజిత, మంత్రి పొంగూ రు నారాయణ కుమార్తె శరణి తెలిపారు. ఆదివారం పప్పులవీధి మహాలక్ష్మి ఆలయం వద్ద ముక్కాల ద్వారకానాథ్, మిత్రమండలి ఆధ్వ ర్యంలో తల్లికి వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భావితరాలకు తల్లి విలువ, గొప్పదనం తెలియజేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం తల్లుల కు బిడ్డలు కాళ్లు కడిగి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమాన్ని కోట సూర్యనారాయణ, పేర్ల సీతారామారావు, శ్రీరాం సురేష్, బైసాని జ్యోతిప్రసాద్ పర్యవేక్షించారు.

అరవిందనగర్ డ్రైనేజీ సమస్యకు త్వరలో పరష్కారం : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని 19, 38 డివిజన్ల మధ్యనున్న అరవిందనగర్ విస్తరణ ప్రాంతంలో డ్రైనేజీ సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కమిషనర్ నందన్‌తో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందన్నారు. అధికారులతో చర్చించి త్వరలోనే పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం పద్మావతి సెంటరు వద్ద పొదలకూరు రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

నెల్లూరు రూరల్, మే 25,(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను ఎవరైనా ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్ఐ వై శ్రీహరి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని దొంతాలి గ్రామంలో ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లకు 18 ఏళ్లు నిండితేనే వివాహం చేయాలని, అప్పుడే సమాజంపై అవగాహన, శారీరకంగా దృఢత్వం ఏర్పడతాయని తెలిపారు. బాలికల భద్రత, మహిళల రక్షణకే పోలీసులు పని చేస్తున్నారన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరో ఎస్ఐ డీ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతోంది : సీపీఎం

నెల్లూరు (వైద్యం), మే 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతోందని నగర మాజీ డిప్యూటీ మేయర్, సీపీఎం నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు విమర్శించారు. నగరంలో సీపీఎం సమైక్యతా యాత్రలు ఆదివారం సుందయ్యకాలనీలో ప్రారంభమయ్యాయి. వెంకటేశ్వర్లు, సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడి ని బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుంటోందని దుయ్యబట్టారు. మతోన్మాద పాకిస్తాన్ ప్రభుత్వం పహల్గాం ఘటనకు ఒక కారణమైతే, మోదీ ప్రభుత్వ విచ్ఛిన్నకర పోకడలు మరో కారణమన్నారు. ఒక ఉగ్రవాది ముస్లిం అయినంత మాత్రాన ముస్లింలంతా ఉగ్రవాదులు కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచల నర్సయ్య, ఒంగోలు సుధీర్, షాహినా బేగం, కామయ్య, మురళి, వీర్ల శ్రీనివాసులు, సుధాకర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సమైక్యత ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ

నెల్లూరు(స్టోన్ హౌస్ పేట), మే 25 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్‌పై ఉగ్ర పోరులో భాగంగా ఆపరేషన్ సిందూర్ పేరుతో వీర సైనికులు సాగించిన పోరుకు మద్దతుగా కూటమి పార్టీలు ఆదివారం విజయోత్సవ తిరంగ ర్యాలీ నిర్వహించాయి. నగరంలోని వేదాయపాళెం సెంటర్ నుంచి అయ్యప్పగుడి సెంటర్ వరకు ఈ ర్యాలీ సాగింది. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ఒక ట్రయిల్ మాత్రమే అని, పాకిస్తాన్ తన శైలి మార్చుకోకపోతే మరెన్నో సిందూర్ ఆపరేషన్లు జరుగుతూనే ఉంటాయన్నారు. ఈ పోరాటంలో అమరులైన వీర సైనికులకు జోహార్లు అర్పిస్తున్నామన్నారు. ఈ ర్యాలీలో వేదాయపాళెం బీజేపీ మండల అధ్యక్షు డు లింగాల రామకృష్ణ, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందర రామిరెడ్డి, బీజేపీ నాయకులు ఎన్‌సీ పెంచలయ్య, మండల ఈశ్వరయ్య, కార్పొరేటర్లు భీమినేని మురహరి, బూడిద పురుషోత్తం, బద్దెపుడి గిరి, తదితరులు పాల్గొన్నారు.



తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి పార్టీల నాయకులు

దేశంలోనే బెస్ట్‌గా వీఆర్ హైస్కూల్

● మంత్రి నారాయణ కుమార్తె శరణి

నెల్లూరు(విద్య), మే 25 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే బెస్ట్ స్కూల్‌గా వీఆర్ హైస్కూల్ ను తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె శరణి తెలిపారు. నగరంలోని వీఆర్ హైస్కూల్ అభివృద్ధి పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. తన తండ్రి పేద కుటుంబం నుంచి వచ్చి ఎంతో కష్టపడి విద్యలో రాణించి ఎదిగారన్నారు. పేదల కష్టాలను చిన్నతనం నుంచే చూసిన ఆయన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతోనే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. ఎన్నికల హామీని నెరవేర్చుకు నేందుకు మూతపడిన వీఆర్ హైస్కూల్‌ను ఆధునీకరిస్తున్నారని తెలిపారు. ఆ పనుల బాధ్యత తనకు అప్పగించడంతో ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నా నని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), మే 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. గుండెవ్యాధి నిపుణురాలు డాక్టర్ కే భార్గవి, దాత నలుబోలు రమణారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

● ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియంలో క్రీడాకారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. దాత శ్రీనివాసులు నాయుడు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బయ్యా రమణయ్య జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 25 (ఆంధ్రజ్యోతి) : కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం టౌనుహాలులో బయ్యా వెంకట రమణయ్య 80వ జయంతి వేడుక జరిగింది. ఈ సందర్భంగా పాటలు, నృత్య పోటీలు నిర్వహించారు. పోషకులు లేక సాహితీ కళారూపాలకు ప్రోత్సాహం కరువైందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేతా సుబ్బారావు, డ్యాన్సు మాస్టర్ రమణయ్య, జయప్రకాష్, షేక్ అబ్దుల్, రఘురామిరెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

'వాత్సల్య' విద్యార్థులకు సత్కారం

నెల్లూరు (హరనాథపురం), మే 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయం విద్యార్థులను మానవసేవయే మాధవసేవ టీం సభ్యులు ఆదివారం సత్కరించారు. 'వాత్సల్య'లో ఆశ్రయం పొందుతూ పదో తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన 23 మంది విద్యార్థులను సత్కరించి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శరణాలయం ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు కిట్ల పంపిణీ

కోవూరు, మే 25(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కిట్లను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ జనసేన కేర్‌టేకర్ చప్పిడి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాభిమానాన్ని పొందుతుందన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సూచనల మేరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామ కమిటీలకు సభ్యత్వ నమోదు కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. పార్టీ కార్యకర్తల్ని ఆదుకోవడానికి జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మున్వర్ బాషా, లోకేష్, తన్మయ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, మే 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా భయన చిరంజీవి మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలుమాల సమర్పించారు. ఆశ్రమ స్థల దాత పొణక కనకమ్మ విగ్రహానికి గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పట్టు వస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పోలంరెడ్డి వెంకురెడ్డికి ప్రముఖుల నివాళి

కొడవలూరు, మే 25(ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తండ్రి పోలంరెడ్డి వెంకురెడ్డి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఘన నివాళులర్పించారు. మండలంలోని నార్నురాజుపాలెంలో ఆలయ నివాసంలో ఆదివారం జరిగిన వర్ధంతి కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర పర్యావరణ అభివృద్ధి మండలి చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు పూల మాలలు వెంకురెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, మందపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చెముకుల శ్రీనివాసులు, సాసిన ప్రసాద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నివాసంలో వేమిరెడ్డి దంపతులు

ఉచిత కంటి వైద్య శిబిరం

పొదలకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి వెంకటేశ్వర అరవింద కంటి వైద్యశాల, నెల్లూరుజిల్లా అంధత్వ నివారణ సంస్థల సంయుక్త సహకారంతో ఆదివారం పొదలకూరులోని విజేత ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణ గళ్ల, అరవింద నేత్రాలయ సిబ్బంది దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

చేపల దుకాణాలపై తూనికలు కొలతల శాఖ దాడులు

● పలువురిపై కేసుల నమోదు

పొదలకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామ్‌నగర్ గేట్ సెంటర్‌లో ఆదివారం చేపల దుకాణాలపై తూనికలు, కొలతలు శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి తూకాల్లో తేడాలు ఉండడంతో పలువురిపై కేసులు నమోదు చేశారు. ప్రతి ఆదివారం రాంగనగర్ గేట్ సెంటర్‌లో చేపల వ్యాపారం జరుగుతుంది. ఈక్రమంలో కేజీకి 100 గ్రాముల చొప్పున తూకాల్లో తక్కువ వస్తుండ డంతో పలువురు కొనుగోలుదారులు తూనికలు కొలతల శాఖకు ఫిర్యాదు చేశారు. దీంతో తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ షేక్ రియాజ్ అహ్మద్ ఆకస్మిక తనిఖీలు జరిపి ఎలక్ట్రానిక్ కాటాలలో తేడాలు ఉన్నట్లు గుర్తించి మూడు కాటాలు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వ్యాపారులు తూకాలలో మోసాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

దుస్థితిలో చవిటి కాలువలు!

పూడికతీతపై దృష్టి పెట్టని పంచాయతీ పాలకులు, అధికారులు

కోవూరు, మే 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పడుగుపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్టీఎస్ సమీపంలో చవిటికాలువలు పూడికతీతకు నోచుకోక దుస్థితిలో ఉన్నాయి. చాలా కాలంగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో వర్షాకాలంలో సమస్యలు తలెత్తుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా ఈ కాలువల్లో పడుగుపాడు పంచాయతీ సిబ్బంది క్రమం తప్పకుండా పూడికతీత పనులు చేపట్టేవారు. అయితే ఈ ఏడాది ఇప్పటికీ పంచాయతీ పాలకులు పట్టించుకోలేదు. పూడిక తీయనందువల్ల ఎన్టీఎస్‌లోని స్విచ్ యార్డులోనికి వర్షపు నీరు ప్రవహిస్తోంది. స్విచ్ యార్డులోనికి వరదనీరు ప్రవహిస్తే విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితి వస్తుందని ఏపీ ట్రాన్స్‌కో అధికారులు చెబుతున్నారు. వర్షాకాలంలో కోవూరు, పడుగుపాడు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు వెంటనే ఎన్టీఎస్‌లోని చవిటి కాలువలకు పూడిక తీయించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎన్టీఎస్ ఆవరణలో పూడికతీతకు నోచుకోని చవిటి కాలువ

వర్షంతో ఉపశమనం

కొడవలూరు, మే 25(ఆంధ్రజ్యోతి): తీవ్రమైన ఎండలతో అల్లాడిపోతున్న జనం కాసింత సేదతీరేలా ఆదివారం సాయంత్రం మండలంలో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ధాటికి అల్లాడిన ప్రజలు సాయంత్రం 4గంటలు తర్వాత వాతావరణం మారి ఉరుములు మెరుపులతో వర్షం పడడంతో ఉపశమనం పొందారు. అలాగే వరి నాట్లు వేస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో కొన్ని గ్రామాల్లోని వీధులు బురదమయం అయ్యాయి. కాగా, గంటపాటు భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు.

నేడు పొదలకూరుకు ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

పొదలకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ఉదయం 10 గంటలకు పొదలకూరు సచివాలయం-3లో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తారని పొదలకూరు మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ

వెంకటాచలం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుపూరు గ్రామంలో ఆదివారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లను ఆపార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాకి శివకుమార్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి ఆపార్టీ నేతలు, కార్యకర్తలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడంటూ ఫిర్యాదు

వెంకటాచలం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుపూరు గ్రామంలో ఇసుక తొలగింపు విషయమై అసభ్యకర పదజాలంతో దూషించి కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచారంటూ ఆదివారం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కసుపూరు గ్రామానికి చెందిన జీ రవిని అదే గ్రామానికి చెందిన కొత్తగుంట సత్యం, కంకూరు వెంగయ్య ఇసుక తొలగింపు విషయమై అసభ్యకరంగా తిడుతూ కర్రతో తలపై కొట్టడంతో గాయమైందని, అడ్డువచ్చిన తల్లి సుబ్బమ్మను సైతం దూషించారని, కుమారుడు అక్షయ్‌కుమార్ అడ్డురాగా అతనిపై కూడా దాడి చేశారని బాధితుడు రవి పోలీసు లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యం కోసం వచ్చి మృత్యువాత

బుచ్చిరెడ్డిపాళెం, మే 25(ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం వచ్చి ఓ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన శనివారం అర్ధరాత్రి జొన్నవాడ ఆలయం వద్ద జరిగింది. జొన్నవాడలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల కోసం అక్కడ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో జొన్నవాడ గిరిజన కాలనీకి చెందిన చంద్రయ్య (59) శ్వాసకోశ సంబంధిత బాధతో అర్ధరాత్రి ఊపిరి తీసుకోవడం కష్టమవడంతో వైద్యం కోసం ఉచిత వైద్య శిబిరం వద్దకు వచ్చి మృతి చెందాడు.

దళితులకు త్వరలో ఇళ్లపట్టాల పంపిణీ

ముత్తుకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో నేలటూరు దళితులకు త్వరలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. నేలటూరు దళితవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను ఆయన ఆదివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8 ఎకరాల్లో గ్రామంలో ఇళ్లు లేనివారి కోసం లేఅవుట్ ఏర్పాటుచేశామన్నారు. పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి సహకారంతో గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అభివృద్ధి పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ముత్తుకూరు మండల అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తామన్నారు.



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మండల టీడీపీ అధ్యక్షులు మల్లికార్జున్‌యాదవ్

పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది

● జనసేన పార్టీ నేత బొబ్బేపల్లి హితవు

వెంకటాచలం, మే 25 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు హితవు పలికారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు. ఆయన నటించిన హరిహర వీరమల్లు సినిమా ఈనెల 12న రిలీజ్ అవుతుందని, దీనిని అడ్డుకోవాలని సినిమా హాళ్లు మూత వేస్తామనడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం సినిమా పరిశ్రమకి పెద్ద పీట వేస్తోందని, సినిమా పరిశ్రమ మీద ఆధారపడి కొన్ని లక్షల కుటుంబాలు బతుకుతు న్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణిభవాని, జనసేన మండల ప్రధాన కార్యదర్శి కాకి శివకుమార్, కార్యదర్శి సందూరి శ్రీహరి, నేతలు మణి, అఖిల్, రాహుల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొబ్బేపల్లి సురేష్‌నాయుడు

ఘనంగా కనకదుర్గమ్మ జాతర

ముత్తుకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పలదరువు గ్రామంలో వున్న కనకదుర్గమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్, నాయకులు వల్లూరు మోహన్‌రావు, నిమ్మా మోహన్‌కిషోర్, గోనెల సిద్ధయ్య, పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీడీపీ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం బాధితులకు సర్వేపల్లి టీడీపీ సమన్వకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో 26 మందికి రూ. 26.05 లక్షలు మంజూరయ్యాయన్నారు. వైద్యపరంగా ఇబ్బందుల్లో ఉన్న వారికి సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆర్థిక సాయం పొందిన వారి తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీ హామీలు ఏమయ్యాయి?

- 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య



ధర్నా పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నెల్లూరు (వైద్యం), మే 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్ర బాబు నాయుడు పలు హామీలు ఇచ్చారని, పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇంటి స్థలం ఇయిస్తామని ప్రకటించారన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశా. పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లలో అన్ని సౌకర్యాలు పూర్తి స్థాయిలో లేవన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు కూడా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశా రు. వీటన్నింటి కోసం జూన్ 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలి పారు. అనంతరం ధర్నాకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ సిరాజ్, షాన్‌వాజ్, నంది పోగు రమణయ్య, సురేష్, వెంకటే శ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 44.197 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం మే 25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 44.197 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నాడెల్టాకు 3,480, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

జిల్లా క్యారమ్ సంఘం కార్యదర్శిగా శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), మే 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్యారమ్ అసోసియేషన్ కార్యదర్శిగా పీ శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చిలకల శ్రీమన్నారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసోసియే షన్‌లో పలు హోదాల్లో సేవలందించడంతో పాటు నెల్లూరు క్లబ్‌లో జరిగిన ఆలిండియా పోటీలను విజయవంతం చేయడానికి శ్రీనివాసులు విశేష కృషి చేశారన్నారు. కాగా, శ్రీనివాసులను నెల్లూరు క్లబ్ కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, క్రికెట్ రంజీ మాజీ క్రీడాకారుడు మలిరెడ్డి కోటారెడ్డి, క్యారమ్ సంఘం ప్రతినిధులు ఎం విశ్వనాథ్, ఎస్‌కే నజీర్‌బాషా, కే శ్రీనివాసులురెడ్డి, జీ రామ్మోహన్‌రెడ్డి అభినందించారు.

పెన్నానదిలో శిలావిగ్రహం లభ్యం



బుచ్చిరెడ్డిపాళెం,మే25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ పెన్నానది ఆవలి ఒడ్డున ఆదివారం సాయంత్రం ఓ శిలావిగ్రహం పలువురి కంటపడింది. ఈ విషయాన్ని ఆలయ అధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి, సేవా కమిటీ చైర్మన్ టీ. అశోకొరెడ్డికి తెలియడంతో వారు వెళ్లి పరిశీలించారు. ఆ విగ్రహానికి కుడివైపు రెండు చేతులు, ఎడమ వైపు ఒక చేయి మాత్రమే ఉంది. కుడి వైపున ఓ చేతిలో త్రిశూలం, రెండో చేతిలో వజ్రాయుధం ఉన్నాయి. ఎడమవైపు చేతిలో శంఖం ఉండగా, రెండో చేయి విరిగి పోయి ఉంది. ఈ శిలా విగ్రహాన్ని ఎవరోతెచ్చి నదిలో పెట్టి ఉంటారని స్థానికులు భావిస్తు న్నారు. దాన్ని ఇవతలి ఒడ్డుకు తీసుకువచ్చి అశ్వత్థ వృక్షం కింద కొలువుతీర్చారు.



ఎన్నికయిన హ్యాండ్‌బాల్ సంఘం నూతన కార్యవర్గం

హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(విద్య), మే 25 (ఆంధ్రజ్యోతి) : హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షుడిగా కే హరిశ్చంద్రారెడ్డి, కార్యదర్శిగా పీ అజయ్ కుమార్, కోశాధికారిగా డీ జితేంద్ర ఎంపికయ్యారు. అసోసియేషన్ చైర్మన్ ఎం రవీంద్ర బాబు మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి సేవలందిస్తున్న వారిని సంఘం ప్రతినిధులు ఎంపిక చేశామన్నారు. వారు జిల్లాలో హ్యాండ్‌బాల్ ఉన్నతికి పాటుపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్, రిటర్నింగ్ అధికారి న్యాయవాది బీ రంగరాజన్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధి ఎస్ వెంకటేశ్వరరావు, జిల్లా ఒలంపిక్ సంఘం ప్రతినిధి అరిగెల విజయ్‌కుమార్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు గాదం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పాతూరులో రెండు బైకుల చోరీ

- పాత ఇనుప సామాను దుకాణానికి తరలిస్తుండగా పట్టివేత



సీసీ పుటేజ్‌లో బైక్ అపహరించుకుపోతున్న యువకుడు

కావలి రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం పాతూరులోని కృష్ణ మందిరం సమీపంలో రెండు మెకానిక్ షెడ్ల దగ్గర ఉంచిన రెండు మోటారు బైకులను శనివారం రాత్రి ఇద్దరు యువకులు చోరీ చేశారు. ఈ విషయాన్ని ఆదివారం షాపుల యజమానులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ షాపుల వద్ద సీసీ పుటేజీలను పరిశీలించగా రెండు మెకానిక్ షెడ్ల దగ్గర ఉంచిన పల్సర్, ఫ్యాషన్ ప్రో బైక్‌లను ఇద్దరు యువకులు దొంగిలించుకు పోవడం రికార్డు అయింది. దీంతో వారు వాహనాల కోసం గాలింపు చేపట్టగా దొంగిలించిన వాహనాలను దొంగిలించిన ప్రాంతానికి సమీపంలో ఉన్న పాత ఇనుప సామాను కొట్టుకు తరలిస్తుండగా బాధితులు పట్టుకుని బైకులు స్వాధీనం చేసుకుని ఒక నిందితుడి 1వ పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రమను దోచేస్తున్న 'ఉపాధి' సిబ్బంది

- నగదు ఇస్తేనే కూలి డబ్బులు
- నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు
- పట్టించుకోని అధికారులు



ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

ఉదయగిరి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): వలసల నివారణే ధ్యేయంగా స్థానికంగా పనులు కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్రం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం శ్రీకారం చుట్టింది. అయితే ఈ పథకం తొలినాళ్ల నుంచి అభాసుపాలవుతూనే ఉంది. ఉపాధి శ్రామికులు నగదు చెల్లిస్తేనే వారికి కూలి డబ్బులు అందుతాయి. నియామకాల్లో కూడా నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. అయినా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు.

● రూ. లక్షల్లో వసూళ్లు

నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది మండలాల్లో ప్రతి రోజు 24వేల మంది ఉపాధి శ్రామికులు పనులకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో పలు పంచాయతీల్లో జరుగుతున్న అవినీతి బాగోతంలో భాగంగా సుమారు 15వేల మంది నుంచి వారానికి రూ. 100 చొప్పున రూ. 15 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. నెలకు లెక్కలు తీస్తే రూ. 60 లక్షల వరకు శ్రామికుల నుంచి దోచుకుంటున్నారు. చర్యలు చేపడతామని గంభీరాలు పలికిన అధికారులు ఆపై చేతులు దులుపుకుంటూ మనకెందుకులే అంటూ మౌనం వహిస్తున్నారు.

● పనులకు రోజూ లక్షమంది..

జిల్లా వ్యాప్తంగా 722 పంచాయతీల పరిధిలో 2.78 లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు లక్ష మంది వరకు ప్రతి రోజు పనులకు వస్తారు. అధికశాతం పంచాయతీల్లో ఈ పథకం కాస్త అధికారులు, సిబ్బందికి కాసుల వర్షం కురిపిస్తోంది. ఎండావానలను లెక్క చేయకుండా కిలోమీటర్ల కొద్ది పనులకు పరుగులు తీసే శ్రామికుల కష్టాన్ని కొంతమంది క్షేత్రస్థాయి సిబ్బంది దోచుకుంటున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు గిట్టుబాటు కూలి నమోదు చేయాలన్నా, ఆశించిన మేరకు పనులు చేయకున్నా, ఒక్కొక్కరు వారానికి రూ. 100 వంతున నగదు చెల్లించాలనే నిబంధనలు కొనసాగుతున్నది. అధికారులకు సైతం సిబ్బంది నుంచి మామూళ్లు అందుతుండడంతో పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. ఈ వ్యవహారాన్ని బయటకు చెబితే భవిష్యత్తు ఇబ్బందులు తప్పవని భావించిన శ్రామికులు చేసేదేమి లేక మౌనంగా ఉంటున్నారు. ఈ పరిస్థితి ఉదయగిరి నియోజకవర్గంలో అధికంగా కొనసాగుతోంది. ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం, వింజమూరు తదితర మండలాల్లో క్షేత్ర సహాయకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, అధికారుల పేర్లు చెప్పి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన గ్రూపు సభ్యులకు తక్కువ నగదు చెల్లింపులు జరుగుతున్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

● నియామకాల్లోనూ అంతే...

రాజకీయ పరిణామాల దృష్ట్యా ఇటీవల పలు మండలాల్లో క్షేత్ర సహాయకుల మార్పు చేశారు. అందులో భాగంగా రాజకీయ నాయకులు తమకు అనుకూలమైన వారిని సిఫార్సు చేయించి, నియమించుకున్నారు. ఏదైనా పంచాయతీ పరిధిలో క్షేత్ర సహాయకుడిని నియమించాలంటే గత మూడేళ్లుగా 25 రోజుల పాటు పనులకు హాజరు కావాల్సి ఉంది. అలాగే స్థానికుడై ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు తొలి ప్రాధాన్యత కల్పించాలనే నిబంధనలను తొంగలో తొక్కి, రాజకీయ పలుకుబడి ఉన్న వారికి అవకాశం కల్పిస్తున్నారు. నూతనంగా విధులు చేపడు తున్న క్షేత్ర సహాయకులు ఒకవైపు రూ. 100 వసూలు చేయడంతో పాటు మరోవైపు బినామీ మస్టర్లు వేస్తూ జేబులు నింపుకుంటున్నారు. మరికొంత మంది ఏకంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా పెట్టి ఉపాధిలో నెలకొన్న అవినీతికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



సంఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు

రోడ్డుప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

కలువాయి, మే 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో నలుగురి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కుల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. గ్రామస్థుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతసాగరం మండలం కమ్మవారిపల్లెకు చెందిన మద్దల మల్లికార్జున, పోలిరెడ్డి ప్రభాకర్, కొమ్మి సుధాకర్, మద్దల మయాంక్‌రెడ్డి అనే చిన్నారి కుల్లూరులోని బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి బైక్‌పై కమ్మవారిపల్లెకు వెళ్తున్న వారిని తిరుపతి నుంచి వింజమూరు మండలం గుండెమడకలకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో వైద్యశాలకు తరలించారు. సంఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉదయగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.అయ్యవారిపల్లి గ్రామ శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామానికి చెందిన దేవండ్ల వెంకటసుబ్బయ్య (39) పని నిమిత్తం తన మోటార్‌బైక్‌పై ఈనెల 22న సీతారామపురం మండలం చిన్నాగంపల్లి గ్రామానికి బయలుదేరాడు. ఈక్రమంలో జీ.అయ్యవారిపల్లి గ్రామ సమీపానికి రాగానే అడవి పందులు అడ్డురావడంతో వాటిని ఢీకొని కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. అటుగా వస్తున్న స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం అతన్ని నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. దీంతో ఆదివారం పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

మోటార్‌బైక్ చోరీ

ఉదయగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలజీనగర్‌లో ఇంటి బయట నిలిపి ఉన్న మోటార్‌బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. బసిరెడ్డి విజయ్ అనే వ్యక్తి బాలాజీనగర్‌లో ఉన్న తన బంధువు అనిల్ ఇంటికెళ్లాడు. ఇంటి బయట బైక్‌ను ఉంచి రాత్రి అక్కడే నిద్రపోయాడు. ఆదివారం ఉదయం లేచి చూసేసరికి బైక్ కన్పించలేదు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలిస్తున్నారు.

ఘనంగా కిమ్స్ సిల్వర్ జూబ్లీ

- ఆసుపత్రికి ఎనలేని ప్రజాదరణ : మంత్రి ఆనం



మంత్రి రామనారాయణరెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న బొల్లినేని భాస్కర్ నాయుడు



జ్యోతి ప్రజ్వలనలో మంత్రి ఆనం, బొల్లినేని సోదరులు, ఎంపీలు వీపీఆర్, బీద, ఎమ్మెల్యేలు

నెల్లూరు (వైద్యం), మే 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో బొల్లినేని కృష్ణయ్య, బొల్లినేని శీనయ్య సహకారంతో బొల్లినేని భాస్కర్‌రావు ఏర్పాటు చేసిన కిమ్స్ ఆసుపత్రికి ఎనలేని ప్రజాదరణ ఉందని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఆదివారం కిమ్స్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కిమ్స్ ఆసుపత్రి పేరు చెబితే బొల్లినేని సోదరులు గుర్తుకు వస్తారన్నారు. నగరంలో ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు మాజీ రాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పాటు బొల్లినేని భాస్కర్ నాయుడు ఎంతో సహకారం అందించారని చెప్పారు. గతేడాది ఎన్నికల్లో తాను పోటీ చేయలేనని ప్రకటించానని చెప్పారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పట్టుబట్టి బొల్లినేని క్రిష్ణయ్య ద్వారా తాను ఎన్నికల్లో పోటీ చేసేలా సహకారం అందించారన్నారు. అటు వైద్య రంగలో, ఇటు రాజకీయంగా బొల్లినేని సోదరులు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కొవిడ్ సమయంలో కూడా కిమ్స్ ఆసుపత్రికి ప్రతిరోజూ 2వేల మంది రోగులు వచ్చే వారన్నారు. అత్యుత్తమ వైద్య సేవలు అందించిన ఘనత కిమ్స్ ఆసుపత్రిదేనని ప్రశంసించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరు, కావలి ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతి, వెంకటకృష్ణారెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్, ఉదయగిరి, కందుకూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు కూడా ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ఎంతో మంది రోగులను కిమ్స్ ఆసుపత్రికి పంపిస్తుంటామని, ఆసుపత్రి ఈడీ గిరినాయుడుతో వైద్య చికిత్సలపై మాట్లాడుతుంటామని తెలిపారు. ఇక్కడి వైద్యులు పేద రోగుల విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తుంటారని వెల్లడించారు. అనంతరం ఆసుపత్రిలో ప్రతిభ చూపిన పలువురికి బొల్లినేని భాస్కర్‌నాయుడు ప్రశంసాపత్రాలు అందచేశారు. ఈ వేడుకలో బొల్లినేని క్రిష్ణయ్య, బొల్లినేని భాస్కర్‌రావు, బొల్లినేని రామారావు, డాక్టర్ బొల్లినేని అభినయ, అపిత, చక్రవర్తి, బొల్లినేని అద్విత్, ఈడీ గిరినాయుడు, డాక్టర్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి కమిటీలు



సమావేశానికి హాజరైన అగ్రిగోల్డ్ బాధితులు

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముం దుకు వచ్చి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు వేసి విచారణ వేగవంతం చేస్తుందని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు తెలిపారు. కావలి సీపీఎం కార్యాలయంలో ఆదివారం అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల ఫలితంగా బాధితుల సమస్యలకు పరిష్కారమార్గం కనిపిస్తోందన్నారు. సమస్య పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం గాని, అలసత్వం గాని ప్రదర్శిస్తే మళ్లీ పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మాల్యాద్రి, అసోసియేషన్ నాయకులు రాధయ్య, మాల్యాద్రి, సురేష్, మహేష్, శివ పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టు పైనుంచి పడి కార్మికుడి మృతి

నెల్లూరు(క్రైం), మే 25 (ఆంధ్రజ్యోతి) : టెంకాయలు కోసేందుకు చెట్టెక్కి కాయలు కోస్తూ ప్రమాదవశాత్తు కిందపడి ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కొండాయపాళెం నక్కల గుంటలో కోటయ్య(36), చెంగమ్మ దంపతులు నివసిస్తున్నారు. వారు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం గోపాల్ అనే వ్యక్తి టెంకాయ చెట్లకు కాయలు దింపేందుకు కోటయ్యను తీసుకెళ్లాడు. అక్కడ టెంకాయలు దింపుతుండగా చెట్టుపై నుంచి కోటయ్య కింద పడ్డాడు. వెంటనే జీజీహెచ్‌కు తరలించగా మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వేదాయపాళెం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కోటయ్య భార్య చెంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సును ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, ఐదుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన బాబురావు



భర్త మృతితో రోదిస్తున్న భార్య

కొడవలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న ట్రావెల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని గండవరం గ్రామం వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడలోని క్రీస్తురాజుపురం ప్రాంతానికి చెందిన 40 మంది ఆ గ్రామం నుంచి విహారయాత్రకు నాగూరునాగపట్నంకు ప్రైవేటు ట్రావెల్ బస్సులో శనివారం రాత్రి బయలుదేరారు. మార్గమధ్యంలో వేకువజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు గండవరం గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కన బస్సును నిలిపారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా చీమకుర్తి నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళుతున్న లారీ వెనుక నుంచి బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు పక్కన నిలబడి ఉన్న సీ.బాబురావు (41) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులో వెనుక సీట్లో కూర్చుని ఉన్న మరో 5 మందికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాబురావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ కోటిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

బిట్రగుంట, మే 25(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్‌కు దక్షిణం వైపు ఎల్సీగేట్ 143 సమీపంలో 207/4-6 కిలోమీటర్ల మధ్య గుర్తుతెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. కావలి జీఆర్పీ ఎస్ఐ రమాదేవి కథనం మేరకు.. బోగోలు కుమ్మరవీధికి చెందిన పొట్టిపాలెం ప్రభాకర్ (53) ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి శవపంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

నెల్లూరు(క్రైం), మే 25 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి ఇంట్లో బెడ్‌పై అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన ఆదివారం నెల్లూరులో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని ఎన్‌టీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన లాబాన్(34), సంగీతకు పదేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. లాబాన్ ల్యాబ్ టెక్నీషియన్‌గా కిసాన్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేస్తూ అక్కడే కాపురం ఉంటున్నాడు. ప్రతి శనివారం భార్య పిల్లలను ఎన్‌టీఆర్ నగర్‌లోని సొంతింటికి తీసుకెళ్లి తల్లిదండ్రుల వద్ద వదిలి రాత్రి ల్యాబ్‌కు వచ్చేవాడు. ఆదివారం తిరిగి తీసుకొచ్చుకునే వాడు. అదేవిధంగా ఈనెల 24వ తేదీ భార్య, పిల్లలను తల్లిదండ్రుల వద్ద వదిలి ల్యాబ్‌కు వచ్చాడు. రాత్రి 10.30కు భార్యతో వీడియోకాల్ మాట్లాడా డు. అయితే ఆదివారం ఉదయం లాబాన్ చర్చికి వస్తానని రాకపోవడంతో భార్య ఫోన్ చేసింది. పలు మార్లు చేసినా తీయక పోవడంతో పక్కింటి వారికి ఫోన్‌చేసి విషయం తెలి పింది. వారు ఇంటి వద్దకు వెళ్లి చూడగా వెనుక తలుపు తెరిచి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా లాబాన్ బెడ్‌పై మృతి చెంది ఉన్నాడు. ముఖానికి ప్లాస్టిక్ కవర్ చుట్టి, షూలేస్‌తో గట్టిగా కట్టి ఉండటాన్ని గమనించారు. ఈ విషయాన్ని భార్య సంగీతకు తెలియజే యడంతో ఆమె హుటాహుటిన ఇంటికి చేరుకుని కన్నీరు మున్నీరైంది. సమాచారం అందుకున్న నవాబుపేట సీఐ వేణుగోపాల్ రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, లాబాన్ అప్పుల విషయమై మూడు రోజులుగా ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం. అలాగే, వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగిందన్న అనుమానాలూ ఉన్నాయి. పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు ప్రారంభిం చారు. పోస్టుమార్టం రిపోర్టుతో స్పష్టత వచ్చే అవకాశం ఉందంటున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 510

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9260
వెండి కిలో ధర	రూ. 1,00,600
వెండి ఒక గ్రాము	రూ.103.60

ఆహిల్యా బాయి హోల్కర్ జయంతి వేడుకలు

బిట్రగుంట, మే 25 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం పాతబిట్రగుంట ద్వారకానగర్ షిరిడీ శేషసాయి మందిరంలో మందిర వ్యవస్థాపకుడు కే.బ్రహ్మానందం ఆధ్వర్యంలో ప్రాచీన హిందూ దేవాలయాల పునఃనిర్మాణ కర్త ఆహిల్యా బాయి హోల్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరమ్మ, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిణి, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, సాయిసేవకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాలు

కందుకూరు, మే 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు, 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు అవసరమైన ఉపకరణాలకు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సక్షమ్ ప్రతినిధి చన్నా రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 80 శాతంకు పైగా వైకల్యం ఉన్నవారికి బ్యాటరీ ట్రైసైకిల్స్, 50 శాతంకు పైగా వైకల్యం ఉన్నవారికి ట్రైసైకిల్స్ ఉచితంగా ఇస్తారని, దీనికి వికలాంగత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోలని తెలిపారు. అలాగే 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు వీల్‌చైర్స్, చెవిటి యంత్రాలు, చేతికర్రలను ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను పెద్దబజారులో ఉన్న చన్నాస్ గోల్డ్‌హౌస్‌లో అందజేయాలని, వివరాలకు 9949334606 నెంబరులో సంప్రదించాలని కోరారు.

జేవీవీ కార్యవర్గ సమావేశం

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక రవినర్సింగ్‌హోమ్‌లో జరిగింది. పట్టణంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు, సీనియర్ ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ, ఆర్ట్స్ సబ్జెక్టులలో, నీట్, ఎంసెట్ పోటీ పరీక్షలలో కూడా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ బెజవాడ రవికుమార్, టీ.సబ్బరాయశర్మ, పీ.జానకిరాం, కందికట్టు నారాయణ, శ్రీకర్ల వెంకయ్య, హరినారపరెడ్డి, గాదిరెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): సీఆర్‌డబ్ల్యుడీఎస్ డైరెక్టర్ వైపె జాకబ్ 7వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కావలిలో ఆ సంస్థ బాధ్యులు గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. కావలి పట్టణ చెరువుకట్ట సంఘం గిరిజన కాలనీలోని గిరిజనులకు చీరలు, పంచలు, ఆహార పొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ వై.టోనీ జయకర్, కోఆర్డినేటర్లు వై.సుధీర్, స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన గుర్తింపు కార్డులు...

లింగసముద్రం, మే 25(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా, పార్టీ సిద్ధాంతాలు కొనసాగించేలా కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంగులూరి నరసింహారావు కోరారు. ఆదివారం లింగసముద్రం పంచాయతీ బలిజపాలెం, జంగంరెడ్డిపాలెం గ్రామాలలో జనసేన గుర్తింపు కార్డులు అందజేశారు.



రాళ్లపాడు ఎడమ కాలువపై పడిపోయిన కల్వర్టు రక్షణ గోడ

ప్రమాదకరంగా ఎడమ కాలువ కల్వర్టు

● రక్షణ గోడ లేక వాహనదారుల ఇబ్బందులు

లింగసముద్రం, మే 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతాహోటల్ నుంచి చీమలపెంట గ్రామానికి వెళ్లే మార్గంలో రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువపై నిర్మించిన కల్వర్టుకు ఓ వైపు రక్షణ గోడ లేక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కల్వర్టు వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు మలుపు కూడా ఉండడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో మరీ ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాలలో ఓ మహిళ మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు, నగదు పంపిణీ



వృద్ధ మహిళకు నగదు అందజేస్తున్న డాక్టర్లు

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి) : డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో కావలి వెంగళరావునగర్‌లోని ఆ సమితి కార్యాలయంలో ఆదివారం 60 మంది నిరుపేద వృద్ధులకు రూ.60 వేల విలువ చేసే నిత్యావసరాలు, నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఊపిరితిత్తుల డాక్టర్ కే. శ్రీనివాసులు మాట్లాడుతూ విశ్వోదయ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) గొప్ప విద్యాదాత, మానవతామూర్తి అని, ఆయన పేరుపై వారి కుమారులు సేవలు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎముకలు, కీళ్ల వ్యాధుల నిపుణులు భానుప్రకాష్, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణురాలు భావన, విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్ రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన



యోగా శిక్షణ ఇస్తున్న కోచ్ అరుణరెడ్డి

బిట్రగుంట, మే 25(ఆంధ్రజ్యోతి): 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ఆయూష్ శాఖ వైద్యుడు కొర్రా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. బిట్రగుంట వాకర్స్, వేసవి శిక్షణ శిబిరంలోని తైక్వాండో చిన్నారులకు ప్రముఖ యోగా కోచ్ అరుణరెడ్డి యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం వాకర్స్ అధ్యక్షుడు బీ.బర్నాడ్, చిన్నారులు యోగా కోచ్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు స్పర్జన్‌రాజ్, మాజీ అధ్యక్షుడు ఎన్ఎస్ యాదవ్, ఫౌండర్ కే.శ్రీనివాసులు, తైక్వాండో కోచ్ రవిగన్, వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోగోలుకు తమీమ్ అన్సారీ సైకిల్ యాత్ర

బిట్రగుంట, మే 25 (ఆంధ్రజ్యోతి): భారతదేశమంతా క్లీన్ సిటీ, గ్రీన్ సిటీలుగా ఉండాలన్న నినాదంతో సైకిల్ యాత్ర చేపట్టిన చెన్నైకి చెందిన తమీమ్ అన్సారీ తిరుగు ప్రయాణంలో ఆదివారం బోగోలు మండలం కప్పరాళ్లతిప్పకు చేరారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 6వ తేదీన బెంగళూరు నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించానన్నారు. తిరుపతి మీదుగా తెలుగు రాష్ట్రాలను దాటుకొని దేశరాజధాని ఢిల్లీకి వెళ్లి తిరిగి కోల్‌కత్త మీదుగా నెల్లూరుకు చేరుకున్నానన్నారు. ఇప్పటి వరకు 5,461 కిలో మీటర్లు ప్రయాణం చేశానని, ఇక్కడి నుంచి స్వగ్రామమైన చెన్నైకి చేరుకుని మరో ఐదు రోజుల్లో బెంగళూరు చేరుకుంటానన్నారు.

చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపు



మేనేజరును సన్మానిస్తున్న ఖాతాదారులు

కలిగిరి, మే 25 (ఆంధ్ర జ్యోతి): ఖాతాదారులకు చేసిన సేవలే బ్యాంకు ఉద్యోగికి గుర్తింపునిస్తాయని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ సీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజరుగా పనిచేస్తూ సీనియర్ మేనేజర్‌గా పదోన్నతిపై గుంటూరు రీజనల్ ఆఫీసుకు బదిలీపై వెళుతుండగా బ్యాంకు ఆవరణలో ఆదివారం ఖాతాదారులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో మేనేజరును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థికి సత్కారం

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో 600కు 593 మార్కులు సాధించి కావలి టౌన్‌ఫస్ట్‌గా నిలిచిన తోట ప్రణీత్‌ను బలిజ-కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఒంటరి మహిళ తోట ఝాన్సీ కుమారుడైన ప్రణీత్‌కు సూరిశెట్టి గోపికిషన్ చేతుల మీదుగా రూ.25 వేలు చెక్కు రూపంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు తోట వెంకటశేషయ్య, నున్నా సచితానందం. నాగిశెట్టి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, అళహరి వెంకయ్య, పీ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి చెక్కు అందచేస్తున్న సంక్షేమ సంఘం బాధ్యులు

అమరా వేదగిరి టీడీపీలో చేరిక

● సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



అమరాకు టీడీపీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, కావలి పట్టణ 33వ వార్డు ఇన్‌చార్జి అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్త ఎట్టకేలకు తన మాతృసంస్థ టీడీపీలో చేరారు. ఆయన ఇటీవల వైసీపీకి, పార్టీ పదవు లకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కావలి పట్టణ 33వ వార్డులోని ఏఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సమక్షంలో వేదగిరి తన అనుచరులతో టీడీపీలో చేరారు. గతంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన వేదగిరి గత వైసీపీ ప్రభుత్వంలో కొన్ని అనివార్యకారణాల వలన వైసీపీలో చేరారు. అప్పటి నుంచి ఆ పార్టీలో కొనసాగిన ఆయన కావలిలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై తన అనుచరులు ప్రోత్సాహంతో తిరిగి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, పోట్లూరు శ్రీనివాసులు, కండ్లగుంట మధుబాబు నాయుడు, తటవర్తి రమేష్, తటవర్తి వాసు, పోతుగంటి శ్రీకాంత్, జ్వాలా సుబ్రహ్మణ్యం, జ్వాలా చంద్ర, బీ. సురేష్ పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో సమైఖ్యత యాత్ర



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

కావలి, మే 25(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వైకుంఠపురం ప్రాంతంలో సమైఖ్యత యాత్రను ప్రాంభిచింది. యాత్రలో భాగంగా వైకుంఠపురం జెండా చెట్టు, పెంకులఫ్యాక్టరీ రోడ్డు, చెరువు కట్ట సంఘం ప్రాంతాలలో ర్యాలీగా వెళుతూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మం ది ప్రాణాలు తీశారన్నారు. వారిలో కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు కూడా చనిపోయారని, ఇది చాలా బాధాకరమన్నారు. అయితే ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ఉగ్రవాదు ల దాడిని ఖండించటంలో ప్రజానీకం ఐక్యత, సమైక్యత స్ఫూర్తిదాయకమన్నారు. ఉగ్రవాదు లు దేశంలో మతపరమైన విభజన తీసుకురావడానికి ప్రయత్నిరచారని, దేశ ప్రజలు సమైక్యంగా ఉండి వారి పథకాన్ని వమ్ము చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం.రమణయ్య, సామేలు, నారాయణ, నాగమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే చోరీల నివారణ : సీఐ



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

కందుకూరు, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రజల అప్రమత్తతతోనే దొంగతనాలను నివారించగలుగుతామని కందుకూరు సీఐ కే.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మదనగోపాలపురంలో ఆదివారం సాయంత్రం ఆయన ప్రజలతో సమావేశం నిర్వహించి సమాజంలోని వివిధ నేరాల అదుపునకు ప్రజల నుంచి అందాల్సిన సహకారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తాళాలువేసి ఉన్న గృహాల్లో దొంగతనాలు జరుగుతున్నందున వాటి నిర్మూలనకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను సూచించారు. మహిళలకు సంబంధించిన నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, సైబర్ నేరగాళ్లబారిన పడి నష్టపోకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

ఆత్మకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. పురప్రముఖులు, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు. బైపాస్ రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమై రవితేజ కల్యాణ మండపం, పాత సినిమాహాలు మీదుగా వైశ్యబజార్, సత్రంసెంటర్, చావిడి సెంటర్, హిల్‌రోడ్, ఎరుకలసాని నగర్, సోమశిల రోడ్డు సెంటర్, ఎల్‌ఆర్‌పల్లి, పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ డిపో వరకు కొనసాగింది. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సీతారామలక్ష్మణ, హనుమంతుల ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి శోభాయాత్ర ప్రారంభించారు. భక్తులు మోటారుబైక్‌లపై శోభాయాత్రలో పాల్గొన్నారు. జైశ్రీరామ్, జైహనుమాన్ నామస్మరణతో పట్టణం మారుమోగింది. భక్తులకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ గావించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో చెంచల వెంకటరమణ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందగా అతని కుటుంబ సభ్యులకు దాత ఆంద్రా బాలగురవారెడ్డి ఆదివారం రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. ముందుగా వెంకటరమణ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, నాయకులు మాలకొండ్రాయుడు, సందిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

యూఈఈయూ నూతన కమిటీ ఎన్నిక

ఆత్మకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ చెర్లో రమణారెడ్డి స్మారకవనంలో ఆదివారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యుఈఈయు) ఆత్మకూరు డివిజన్ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా యుఈఈయు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జి శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండమూరి హజరత్తయ్య, డివిజన్ అధ్యక్షుడిగా సీహెచ్ ఓంకార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ విజయరామిరెడ్డి, కోశాధికారిగా షేక్ మస్తాన్, మహిళా కార్యదర్శిగా కె శాంతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ నరసింహారెడ్డి, ప్రచార కార్యదర్శిగా వై రమణారెడ్డి ఎన్నికయ్యారు. వీరితోపాటు సహాయ కార్యదర్శులు, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, యుఈఈయు జిల్లా అధ్యక్షుడు వి సుధాకర్‌రావు, సీఐటీయు మండలాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, జిల్లా రైతు సంఘం నాయకులు జి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన యూఈఈయూ నేతలు

మహానాడును విజయవంతం చేయాలి

● దేవదాయ శాఖామంత్రి ఆనం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరులోని ఆనం క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గ కీలక నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడుకు వచ్చే కార్యకర్తలకు అవసరమైన వసతి, ఆహారం, రవాణా తదితర అన్ని ఏర్పాట్లు ముందుగానే సమన్వయంతో చేసుకోవాలని నేతలకు సూచించారు. భారీ స్థాయిలో జరిగే మహానాడుకు ఆత్మకూరు నియోజ.కవర్గం నుంచి 10 వేల మందికి పైగా టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మహానాడు కార్యక్రమానికి ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అప్కాబ్ చైర్మన్ గుంజి వీరాంజనేయులు, పలువురు టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

నాగవరపమ్మకు పూజలు



నాగవరపమ్మకు పూజలు చేస్తున్న పూజారి

సంగం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగవరపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సహకారంతో ఆల యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సీతారామపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను శాలువా, మొమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు షఫీఅహ్మద్, శ్యాంబాబు, సుధాకర్, పీసీ అల్లూరిరాజు, జనార్దన్‌రాజు, వెంకటరెడ్డి, కృష్ణయ్య, మహబూబ్ మస్తాన్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో వీధులు జలమయం



అనంతసాగరంలో చిత్తడిగా మారిన రోడ్డు

ఉదయగిరి, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. వర్షంతో వీధులు జలమయం అయ్యాయి. మురుగు కాలువలు పొంగిపొర్లాయి. చెత్తాచెదారం రోడ్లపై చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో చెరువుల గుంతల్లోకి నీరు చేరింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు పొలాలను దుక్కులు దున్ని సేద్యానికి సిద్ధం చేస్తున్నారు.

● అనంతసాగరం : కొద్దిపాటి వర్షం కురిసినా స్థానిక కెనరా బ్యాంకు సమీపంలో బీసీ కాలనీకి వెళ్లే రోడ్డు చిత్తడిగా మారుతోంది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక రహదారిపై వర్షపు నీరు నిల్వఉండి దుర్గంధం వెదజల్లుతోందని పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ యువత రాణించాలి : సీఐ



చాంపియన్ షిప్ సాధించిన క్రీడాకారులతో సీఐ గంగాధర్, అధ్యాపకులు

ఆత్మకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): యువత విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆత్మకూరు సీఐ జి గంగాధర్ సూచించారు. స్థానిక ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాలలో ఆదివారం క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్‌జెడి క్రీడాకారులు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్ సాధించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ సిరిమావిళ్ల వెంకటేశ్వర్లు, అధ్యాపకులు శ్రీనివాసులరెడ్డి, మధుసూదన్ రెడ్డి, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

అంకాలమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ

సీతారామపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని బెస్తకాలనీలో జరుగుతున్న కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరిరోజు ఆదివారం అంకాలమ్మ ఆలయం వద్ద అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. గ్రామం నుంచి భక్తులు ఊరేగింపుగా పొంగళ్లు నెత్తిన పెట్టుకొని అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమశిలకు 30 పడకల ఆసుపత్రి మంజూరు

అనంతసాగరం మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిలకు 30 పడకల ఆసుపత్రి మంజూరైంది. ఈవిషయం ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. దీంతో పక్కాభవనం పూర్తి చేసే లోపు తాత్కాలిక భవనాల్లో వైద్యశాల ఏర్పాటుచేసి ప్రజలకు సేవలు అందించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల సోమశిలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సందర్శించి ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం స్థానికులతో ముఖాముఖి ఏర్పాటుచేయగా ఆసుపత్రి లేక అవస్థలు పడుతున్నామని సీఎంకు విన్నవించారు. దీంతో ఆయన మంత్రి ఆనం ద్వారా పూర్తి సమాచారం తెలుసుకున్నారు. 30 పడకల ఆసుపత్రికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈనేపథ్యంలో ఆసు పత్రి సేవలు త్వరలో అందుబాటులోకి వస్తున్న క్రమంలో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచ శాంతికి కృషి చేయాలి

వింజమూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతికి అందరూ కృషి చేయాలని పాకాల సీనియర్ పిరమిడ్ మాస్టర్ గిరి సూచించారు. స్థానిక వేదవ్యాస విశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవిచంద్ర, చిన్న, సుబ్బారెడ్డి, జానకీ రామిరెడ్డి, నారాయణ రెడ్డి, ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో తరగని రద్దీ

సర్వదర్శనానికి 15 గంటలు

శనివారం అత్యధికంగా 90,211మందికి దర్శనం

వేసవి సెలవులు ముగుస్తుండగటం.. వారాంతం కావడంతో తిరుమలకు శుక్రవారం మొదలైన రద్దీ ఆదివారమూ కొనసాగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండుగా కనిపిస్తున్నాయి. కృష్ణతేజ సర్కిల్ మీదుగా రింగురోడ్డులోని శిలాతోరణం సర్కిల్ వరకు దాదాపు కిలోమీటరు మేర క్యూలైన్ ఉంది. వీరికి 15 గంటలు, టైంస్లాట్ టోకెన్లు, టికెట్ల భక్తులకు మూడు గంటల తర్వాత దర్శనం అవుతోంది. శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, బస్టాండ్, సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి కార్యాలయాలు, లగేజీ కౌంటర్లు, కల్యాణకట్టల్లో భక్తులు కిటకిటలాడుతున్నారు. శ్రీవారిపాదాలు, పాపవినాశనం కూడా రద్దీగా మారాయి. అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గాల గుండా భక్తులు తరలివస్తున్నారు.

24 రోజుల్లో 17.81 లక్షల మందికి దర్శనం

వేసవి సెలవుల నేపథ్యంలో మే 1 నుంచి 24వ తేదీ వరకు 17.81 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో ఈనెల మొదటివారంలో భక్తుల సంఖ్య సాధారణంగానే కనిపించినా.. గత 15 రోజుల్లో భారీగా వచ్చారు. 4, 5, 10, 17, 18, 21వ తేదీల్లో 80 వేలకుపైగా శ్రీవారిని దర్శించుకోగా, శనివారం ఆ సంఖ్య 90,211 కి చేరింది. గత 24 రోజుల్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.80.82 కోట్లు లభించగా, 7.61 లక్షల మంది తలనీలాలు సమర్పించారు. 51 లక్షల మందికి అన్నప్రసాదాలు, బయట క్యూలలో మరో 20 లక్షల మందికి పాలు, టీ, కాఫీ, మజ్జిగ, స్నాక్స్ పంపిణీ చేశారు. శనివారం ఒక్కరోజే వెంగమాంబ అన్నప్రసాదభవనంలో అత్యధికంగా 93,950 మంది అన్నప్రసాదాలు స్వీకరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి మెట్టు వద్ద పోటెత్తిన భక్తులు



తిరుమలకు నడిచి వెళ్లే భక్తులతో చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారి మెట్టు ఆదివారం రద్దీగా మారింది. ఈ మార్గాన ఐదు వేల మందికి మాత్రమే టైమ్ స్లాట్ దర్శన టోకెన్లు ఇచ్చారు. అయితే ఆదివారం దాదాపు పది వేల మంది ఇక్కడికి చేరుకున్నారు. టోకెన్లు లేకపోవడంతో కొందరు నిరాశతో వెనుదిరగ్గా.. చాలామంది తిరుమలకు నడిచి వెళ్లారు. సర్వదర్శనంలో స్వామిని దర్శించుకున్నారు. ఇక్కడి సెక్యూరిటీ సిబ్బంది స్థానిక ఆటోలను మాత్రం ముందుగా అనుమతించి.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ఆపేస్తున్నారని భక్తులు ఆరోపించారు. దీనివల్ల తమకు టోకెన్లు అందడంలేదంటూ వారు సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



గృహప్రవేశ కార్యక్రమంలో పూజలు

జనసంద్రం.. శివపురం

ఘనంగా చంద్రబాబు గృహప్రవేశం

ఉదయంనుంచి సాయంత్రం దాకా విందు భోజనాలు

ఆత్మీయ పలకరింపులు

కుప్పం/శాంతిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): వచ్చిపోయే జనాలు.. సుష్టుగా భోజనాలు.. ఆత్మీయ పలకరింపులు.. అడిగినవారికల్లా ఫొటో సెషన్లు.. ముఖ్యమంత్రి చంద్రబాబు గృహప్రవేశం జాతరను తలపించింది. ఆయన సొంతిల్లు నిర్మించుకున్న చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం పరిసరాలు వేలాదిమంది జనసందోహంతో జాతరను తలపించింది. చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు ఆదివారం తెల్లవారుజామున 4.30-5.00 గంటల ప్రాంతంలో గృహప్రవేశం చేశారు. ఇంట్లో హోమం వెలయించి సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. చంద్రబాబు దంపతుల కుమారుడు, మంత్రి నారా లోకేశ్, నారా బ్రాహ్మణి దంపతులు కూడా ఈ పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 9-10 గంటల దాకా పూజలు కొనసాగాయి. 11.30 గంటలకు నలుగురూ నూతన గృహం ఎదుట ప్రత్యేకంగా నిర్మించిన షెడ్డులోకి వచ్చి ఆశీనులయ్యారు. ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 2.30 గంటలదాకా ఏకధాటిగా కొనసాగింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, పక్కనే ఏర్పాటు చేసిన భోజనశాలకు వెళ్లి.. అక్కడక్కడా భోజనం చేస్తున్న వారిని పలకరించారు. భోజనాలు ఎలా ఉన్నాయని కనుక్కున్నారు. అనంతరం నూతన గృహంలో కుప్పం నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ, బూత్ ఇన్‌చార్జులతో సమావేశమై కుప్పం నియోజకవర్గ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులతోపాటు, నారా లోకేశ్ దంపతులు కూడా ఆదివారం రాత్రి నూతన గృహంలోనే బస చేశారు. కాగా, కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆదివారం ఉదయం 7 గంటలకల్లా చంద్రబాబు నూతన ఇంటి వద్దకు చేరుకున్నారు. వీరందరికీ టిఫిన్లు, కాఫీలు పెడుతూ వచ్చారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు మధ్యాహ్న భోజనాలను ప్రారంభించగా.. సాయంత్రం మూడునాలుగు గంటల దాకా కొనసాగుతూనే ఉన్నాయి. సుమారు 30 వేలమంది నియోజకవర్గ ప్రజలు గృహప్రవేశానికి హాజరై భోజనాలు చేసివెళ్లారు.



చంద్రబాబు ఇంటి వద్ద భోజనం చేస్తున్న జనం

వరుస కట్టిన ఎమ్మెల్యేలు

చంద్రబాబు గృహప్రవేశానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు పలువురు హాజరయ్యారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, జగన్మోహన్, మురళీమోహన్, గాలి భానుప్రకాష్, థామస్,ఆరణి శ్రీనివాసులు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు హాజరయ్యారు.

బదిలీల కోసం అడ్డదారులు

● ఆఫీసు బేరర్ల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

చిత్తూరు సెంట్రల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ఈనెల 16 నుంచి జూన్ రెండు వరకు, ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి జూన్ ఆరో తేదీ వరకు బదిలీలు జరగనున్నాయి. 98 ప్రభుత్వ శాఖల్లో సుమారు 15వేల మంది ఉద్యోగులు ఉండగా, ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో ఏకంగా 15,454 మంది టీచర్లు పనిచేస్తున్నారు. బదిలీల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు (ఆఫీసు బేరర్లకు) కలెక్టర్ ఆమోదం తప్పనిసరి కానుంది. అయినా కొందరు అడ్డదారుల్లో ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ సంఘం నేతల లేఖలైనా, బదిలీల్లో ప్రాధాన్యం పొందడానికి కలెక్టర్ ఆమోదం తప్పనిసరి. ఇలాంటి బేరర్ల సిఫారసు లేఖలను కలెక్టర్‌కు పంపాలి. కలెక్టర్ అధ్యక్షతన నియమించిన కమిటీ వీటిని పరిశీలించి, ఆయన ఆమోదం తీసుకున్నాకే ఆయా శాఖలకు పంపుతారు. అప్పుడే ఆఫీసు బేరర్లకు బదిలీల్లో ప్రాధాన్యం లభిస్తుంది. ఇక్కడే కొందరు తాము సంఘంలో నేతలమంటూ ఎన్నికల అధికారి, పరిశీలకుల సంతకం లేకుండా కేవలం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ద్వారా ముందు తేదీల్లో తెచ్చిన లేఖలు సమర్పిస్తున్నారన్న విమర్శలున్నాయి.



గోవిందరాజస్వామి హైస్కూల్‌లో పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు





బొట్టు పెట్టి పరీక్షకు పంపి..

తిరుపతి(కలెక్టరేట్), మే 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 5,261మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంది. వీరిలో ఉదయం రాత పరీక్షలకు 2,941 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 2,929 మంది హాజరయ్యారు. తిరుపతిలో 13 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి. ఉదయం 9.30 నుంచి 11.30 వరకు పేపర్-1.. మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు పేపర్-2 పరీక్షలు నిర్వహించారు. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించలేదు. దీంతో పలువురు కన్నీరు పెట్టారు. ఈ పరీక్షలను రాష్ట్ర పరిశీలకుడు కోన శశిధర్, జాయింట్ సెక్రటరీ అజ్మీరా, కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు.



సమయం దాటి వచ్చారని అనుమతించకపోవడంతో గేటు బయటే అభ్యర్థులు

పడిపోయిన మామిడి ధర

● నిరాశ చెందుతున్న రైతులు



దామలచెరువు మార్కెట్‌లో అమ్మకాలకు సిద్ధంగా బేనీషా

పాకాల,మే25 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల కారణంగా ఆలస్యంగా పూత రావడం.. దిగుబడి తక్కువగా ఉండటంతో ఈ ఏడాది మామిడి ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారు. కానీ, ఆశించిన ధరల్లేకపోవడంతో నిరాశ చెందారు. పాకాల మండలం దామలచెరువులోని మ్యాంగోనగర్‌లో సుమారు 120 మండీలున్నాయి. సీజన్‌లో ఒక రోజుకు.. ఒక్కో మండీలో 20 నుంచి 30 టన్నులు సరాసరి క్రయ విక్రయాలు జరుగుతాయి. పులిచెర్ల, ఎర్రావారిపాళ్యం, చిన్నగొట్టిగల్లు, రొంపిచెర్ల, పీలేరు. సదుం, సోమల, ఐరాల, పూతలపట్టు, పెనుమూరు, చంద్రగిరి మండలాల రైతులు ఇక్కడికి మామిడి కాయలు తీసుకొస్తారు. రూ.కోట్లలో వ్యాపార లావాదేవీలు జరుగుతాయి. సీజన్ ప్రారంభంలో బేనీషా నాణ్యతను బట్టి టన్ను రూ.25వేల నుంచి 35 వేలు, పులేరా రూ.15 వేల నుంచి 20వేలు, ఖాదర్ రూ.30 వేల నుంచి 40 వేలు, తోతాపురి కలర్ ఎగుమతికి రూ.18 వేల నుంచి 20 వేల వరకు ధరలు పలికాయి. ఇతర రాష్ట్రాల వ్యాపారులు వస్తే ధరలు పెరుగుతాయని రైతులు భావించి పరిమితిగానే కోతలు కోశారు. ఆదివారం ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. బేనీషా రకం కాయలు గుజ్జుపరిశ్రమలు టన్ను 9 వేలకు కొనుగోలు చేశారు. ఖాదర్ రూ.27వేల నుంచి 28 వేలు, పుల్లేరా గుజ్జు పరిశ్రమలు టన్ను రూ.7వేలకు కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యాపారులు, దళారులు, మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్‌గా మారి ధరలు నియంత్రిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభంకాని తోతాపురి కొనుగోళ్లు



జిల్లాలో అధిక విస్తీర్ణంలో పండించే తోతాపురి మామిడికాయల కొనుగోళ్లను గుజ్జు పరిశ్రమలు ఇంకా ప్రారంభించలేదు. కొనుగోలు ధర ప్రకటించలేదు. మామిడి తోటల్లో తోతాపురి కాయలు పక్వానికి వచ్చి కోత దశలో ఉన్నాయి. గుజ్జు పరిశ్రమలు ఇప్పటివరకు ధర ప్రకటించలేదు. మామిడి గుజ్జు తయారీ పరిశ్రమలు రైతుల నుంచి కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించి నాలుగురోజులైనా జిల్లా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. గిట్టుబాటు ధర కల్పిస్తామని కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు సమావేశమై చర్చించినా ఆచరణలోకి రాలేదు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపట్టాలని మామిడి రైతులు వేడుకుంటున్నారు.

కాలిబాటలో చిరుత సంచారం

తిరుమల, మే25(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలి నడక మార్గంలో ఆదివారం రాత్రి చిరుత సంచారం కలకలం సృష్టించింది. ఈ మార్గంలోని 350వ మెట్టువద్ద చిరుతను చూసిన కొందరు భక్తులు హడలిపోయారు. అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోయారు. చిరుతసంచార సమాచారాన్ని సమీపంలోని సిబ్బందికి తెలియజేశారు. దీంతో విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. మెగాఫోన్‌తో విజిలెన్స్ సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులను గుంపుగా తిరుమలకు పంపారు. ఒంటరిగా ఎవరూ వెళ్లొద్దని సూచించారు. అలాగే అటవీశాఖ సిబ్బంది చిరుత సంచరించిన ప్రదేశానికి చేరుకున్నారు. చిరుత అడవిలోకి వెళ్లిపోయేలా శబ్దాలు చేశారు.

అంజేరమ్మ కనుమ వద్ద ఫైవ్ స్టార్ రిసార్ట్



రిసార్టుకు ప్రతిపాదించిన స్థలం

వడమాలపేట,మే 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై జాతీయ రహదారి వడమాలపేట సమీపంలోని అంజేరమ్మ కనుమ వద్ద ఫైవ్ స్టార్ రిసార్ట్ నిర్మాణం కానుంది. దీనికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రిసార్టుకు ఎస్వీ పురం రెవెన్యూ సర్వే నెంబరు 428/2,3 లలో 12.70 ఎకరాలను పర్యాటక శాఖకు ప్రభుత్వం కేటాయించింది. అద్దె ప్రాతిపదికన 66 ఏళ్ల పాటు.. నిర్వహణ ప్రాతిపదికన 33 ఏళ్లపాటు పొడిగించుకోడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఒడిశాకు చెందిన బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్ సంస్థ రూ.150 కోట్లతో రిసార్టు నిర్మాణం చేపట్టనుంది. నగిరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చింది. ఇటీవల టూరిజం ఉన్నతదాధికారులు ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈ రిసార్టు ద్వారా దాదాపు 350 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

మహానాడుకు తరలిరండి: పాశం



ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27, 28, 29వ తేదీలలో జరగనున్న మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పేదప్రజలకు సేవా చేయాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఆయన ఆశయాలను నేడు సీఎం చంద్రబాబు నెరవేర్చుతూ పేదలకు అనేక సంక్షేమపథకాలను అమలు చేస్తున్నార న్నారు. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్‌ను ప్రతిపాదిస్తున్నా మని, మహానాడులో దీనిపై చర్చిస్తామని వివరించారు.

కరాటేలో చెందోడు విద్యార్థినికి అవార్డు



వెంకటలాస్యను అభినందిస్తున్న అధికారులు

కోట, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెందోడు విద్యావికాస్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న వెంకటలాస్య కరాటే పోటీలలో రాష్ట్రస్థాయి అవార్డు సాధించింది. తెనాలి పట్టణంలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను విక్టోరియా షాటోకామ్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ నిర్వహించింది. ఈ రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో వెంకటలాస్య కటా ఈవెంట్‌లో పాల్గొని రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం సాధించింది. మంగళగిరి ఎస్పీ బల్లి రవిచంద్ర చేతుల మీదుగా అవార్డు, ప్రశంస పత్రాలను వెంకటలాస్య అందుకుంది. ఆ చిన్నారికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ హరిబాబును పాఠశాల యాజమాన్యం అభినందనలతో ముంచెత్తింది.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజేంద్రరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, రాఘవరెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారికి ఆదివారం పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని అమ్మవారికి నైవేద్యం నివేదించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అభయాంజనేయస్వామి గ్రామోత్సవం



కోట, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సిద్ధవరంలో ఆదివారం తెల్లవారుజామున అభయాంజనేయస్వామి గ్రామోత్సవం జరిగింది. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామి విగ్రహాలతో సిద్ధవరం పురవీధుల్లో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివారు ఊరేగుతున్న సమయంలో భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మూడు రోజుల పాటు జరిగిన హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి.

డివైడర్‌ను ఢీకొన్న కారు - ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన మహిళ

వాకాడు, మే 25 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యాత్రికులు గాయపడ్డారు. తిరుపతి ప్రాంతానికి చెందిన 10 మంది రెండు కార్లల్లో తూపిలిపాళెం సముద్రతీరానికి ఆదివారం వచ్చారు. సరదగా గడిపి తిరుగు ప్రయాణ మయ్యారు. వాకాడు స్వర్ణముఖినది రోడ్డుపై వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని వాకాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ దక్షిణవైపు ముఖద్వారం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మన్నారుపోలూరుకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ప్రభాకర్ దంపతులు చెంగాళమ్మ ఆలయానికి వచ్చి తిరిగి మోటారు సైకిల్ పై వెళ్తుండగా జాతీయ రహదారిపై చెంగాళమ్మ ఆర్చీ వద్ద చెన్నైవైపు వెళ్లే మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రభాకర్ కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. వీరిని స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జామాయిల్ చెట్ల నరికివేత



చిల్లకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి గ్రామంలో గుర్తుతెలియని కొందరు తమ జామాయిల్ చెట్లను నరికివేశారని బాధితులు పరుశురామయ్య, తిరుపతి ఆదివారం తెలిపారు. బాధితుల వివరాల మేరకు... కొన్నేళ్లుగా గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో జామాయిల్ చెట్లును సాగుచేసుకుని జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఆదివారం వేకువన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తాము సాగు చేసుకుంటున్న 5 ఎకరాల పొలంలోని చెట్లను నరికివేయడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మహానాడును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరగనున్న మహానాడుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య కోరారు. ఆదివారం ఆయన మండలంలోని అర్ధమాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పాపాడి రాజగోపాల్‌రెడ్డ తదితరులు ఉన్నారు.

మహానాడును విజయవంతం చేద్దాం

- కీలక నేతలతో మహానాడు జనసమీకరణపై సమీక్ష
- మహానాడు అంటే తెలుగువారికి పండగ లాంటిది
- మీడియాతో ఎమ్మెల్యే కురుగొండ్ల, నుడా చైర్మన్ కోటంరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

వెంకటగిరి, మే 25: (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించే మహానాడును విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం మహానాడు జనసమీకరణపై పార్టీ నేతలకు వారు దిశానిర్దేశం చేశారు. అనంతరం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకరంగా నిర్వహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు విధిగా పాల్గొనేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. వెంకటగిరి నియోజకవర్గం నుంచి 5 వేల మందికి తగ్గకుండా జనసమీకరణ ఉంటుందన్నారు. మండలానికి వెయ్యిమంది తగ్గకుండా జనసమీకరణ ఉండాలన్నారు. ఆయా మండలాల నేతలలు ఈ బాధ్యతలు తీసుకోవాలన్నారు. మహానాడుకు వచ్చే కార్యకర్తలకు, నాయకులకు అవసరమైన రవాణా, వసతి, భద్రత, ఆహారం వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే సమన్వయంతో ఏర్పాటుచేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు జన్ని రమణయ్య, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, వెంకటగిరి రూరల్, డక్కిలి, రాపూరు మండలాల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, జోరేపల్లి వెంకటేశ్వర్లు రెడ్డి, దాసరి ప్రభాకర నాయుడు ఉన్నారు.

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి..ఇక్కడే కలిశాం

- ఎన్‌బీకేఆర్‌లో అలరించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం





సంబరాలు చేసుకుంటున్న పూర్వపు విద్యార్థులు, మాట్లాడుతున్న పూర్వపు విద్యార్థి, ఏసీపీ సంజయ్‌కుమార్

కోట, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ 38ఏళ్ల తర్వాత పూర్వపు విద్యార్థులు ఒకే వేదికపైకి చేరుకుని ఒకరి యోగక్షేమాలు తెలుసుకుంటూ కొన్ని గంటలపాటు ఉల్లాసంగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సందడి చేశారు. కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ బీఈడీ కళాశాలలో 1986 -87 విద్యాసంవత్సరంలో బీఈడీ చదివిన పూర్వపు విద్యార్థుల సమ్మేళనం ఎన్‌బీకేఆర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగింది. అప్పటి గురువు, ప్రిన్సిపాల్ నేదురుమల్లి రవిశేఖర్‌రెడ్డిని విద్యార్థులు ఆప్యాయంగా పలకరిస్తూ పాదాభివందనం చేస్తూ ఆనాటి మధురస్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. ఇక్కడ పూర్వపు విద్యార్థి తెలంగాణలోని సైఫాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఆర్ సంజయ్‌కుమార్ బీఈడీ చదివే రోజుల్లోని అనుభవాలను వేదికపై నుంచి పంచుకున్నారు. అప్పట్లో ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలో నేర్పిన క్రమశిక్షణ, చూపిన మార్గాలు తమ బంగారు భవితకు బాటలు వేశాయని పలువురు పూర్వపు విద్యార్థులు ఉద్వేగంతో మాట్లాడారు. ఎక్కడెక్కడో ఉన్న విద్యార్థులందరూ 38 సంవత్సరాల తర్వాత కలుసుకుని ఉల్లాసంగా గడిపారు.

చిట్టేడులోనూ అపూర్వ సమ్మేళనం..

చిట్టేడులోని నల్లప్పరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990 - 91 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో అపూర్వ సమ్మేళనం జరిగింది. అప్పటి గురువులకు పూలమాలలు, మెమొంటోలతో అభినందించారు.





ఐసీఎస్‌రోడ్డులో కురుస్తున్న వర్షం, కోనేటిమిట్టలో కురుస్తున్న వర్షం

గూడూరులో కుండపోత

గూడూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం సాయంత్రం ఒక్క సారిగా కుండపోత వర్షం కురి సింది. ఉదయం నుంచి కొంత ఎండగా ఉన్నా మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం వర్షం గంటపాటు కురిసింది. తర్వాత ఆగి మళ్లీ విడతలు విడ తలుగా కురిసింది. ఉక్క పోతతో అల్లా డిన ప్రజలు వాతావరణం చల్ల బడడంతో సేదతీరారు. వర్షం కారణంగా ఐసీఎస్‌రోడ్డు, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి, కోనేటిమిట్ట తదితర ప్రాంతాలలోని పలు రోడ్లపై వర్షపునీరు ప్రవహించింది. పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

ముగిసిన నాగారపమ్మ జాతర

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- గ్రామస్తులు, బంధుమిత్రులతో నిండిపోయిన ఓజిలి



ఊరేగుతున్న అమ్మవారు

ఓజిలి, మే 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవత నాగారపమ్మ మాత జాతర ఆదివారం ముగిసింది. ఆదివారం తెల్లవారు జామునుంచి సాగిన గ్రామోత్సవం, ఊరేగింపు మధ్యాహ్నం వరకు కొనసాగింది. డప్పులు, మేళతాళాలతోపాటు గంటపెట్టి, వీరతాళ్లు వంటి కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారికి ఇంటింటా భక్తిశ్రద్ధలతో హారతి కర్పూరంతోపాటు టెంకా యలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ బంధువులు, మిత్రులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్య క్రమాలతోపాటు పాటకచ్చేరి ఆలరించింది. భక్తులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఎస్‌ఐ స్వప్న తమ సిబ్బందితో బందో బస్తును పర్యవేక్షించారు.

కాళంగి బ్రిడ్జిపై నుంచి
నదిలో పడిన గుర్తుతెలియని వ్యక్తి

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళలమ్మ ఆలయ సమీపంలో ఉన్న కాళంగి వంతెనపై ద్విచక్ర వాహనంలో వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాళంగి నదిలో పడిపోయాడు. సూళ్లూరుపేట నుంచి ఏపీ 39 క్యూఎఫ్ 0892 నెంబరు గల బైక్‌పై వెళుతుండగా సైడు గోడను ఢీకొనడంతో బైక్ పై నుంచి ఎగిరి నదిలో పడిపోయాడు. అటువైపు వెళ్తున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి కావడంతో వీలుకాలేదు.

దాడి కేసులో యువకుడి అరెస్ట్

చిల్లకూరు: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో కోట మండలం నెల్లూరుపల్లికొత్తపాళెం గ్రామానికి చెందిన గణేష్ కాకువారిపాళెం గ్రామానికి చెందిన శ్రీనివాసులుపై ఆదివారం దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

27 నుంచి యోగా శిక్షణ కార్యక్రమాలు



యోగా శిక్షణను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట మండలంలో ఈ నెల 27 నుంచి 31 వరకు యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో ఏవీ మురళికృష్ణ తెలిపారు. మండలంలో మొత్తం 4 క్లస్టర్లగా విభజించి యోగా శిక్షణ ఐదురోజుల పాటు నిర్వహించ నున్నట్లు తలిపారు. ఈ యోగా శిక్షణలో అన్ని గ్రామాల నుంచి అందరూ వచ్చేలా సంబంధిత అధికారులు చొరవతీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్రపై క్లస్టర్ పరిధిలో యోగా శిక్షణ ఇచ్చే మోటీవేటర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణను ఎంపీడీవో పరిశీలించారు.

వర్షంతో వరి పంటకు జీవం

పెళ్లకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వేసవిలో ఎండల తీవ్రతతో అధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో ఎడగారులో వరిసాగు చేసిన రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ సమయంలో ఆదివారం కురిసిన ఓ మోస్తారు వర్షం వరి పంటకు జీవం పోసింది. రెండురోజులుగా కురిసిన వానతో వాతావరణం చల్లబడడంతో పాటు కలవకూరు, పెరుమాళ్లపల్లి, జీలపాటూరు, చిల్లకూరు, పెళ్లకూరు, కొత్తూరు, భీమవరం, నెలుబల్లి, అక్కగారిపేట, పసుపుకండ్రిగ, పుల్లూరు, చింతపూడి, అర్ధమాల, అర్లపాడు తదితర గ్రామాల్లో వరికి జీవం పోసింది.

రోడ్డు ప్రమాదంలో కృష్ణా జిల్లా యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన అనిల్

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శ్రీహరికోటకు వెళ్లే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీసిటి కోల్‌గేట్ పరిశ్రమలో పనిచేసే అనిల్ (22) మృతి చెందాడు. అదే కంపెనీలో పనిచేసే ప్రేమ్‌కుమార్, గణేష్ అనే యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం నాగాలయలంకకు చెందిన మృతుడు అనిల్, గాయపడిన ప్రేమ్‌కుమార్, గణేష్‌లు శ్రీసిటీలోని కోల్‌గేట్ కంపెనీలో పనిచేస్తున్నారు. వీరు సూళ్లూరులో ఉన్న ఓ హాస్టల్లో ఉంటున్నారు. ఆదివారం సెలవు కావడంతో ముగ్గురు మోటారు సైకిల్ పై సరదాగా షార్ రోడ్డువైపు వెళ్లి తిరిగి వస్తుండగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై ముందుపోతున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. ఆటోను ఢీకొట్టిన వారి వాహనం పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరూ యువకులను 108లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విష మంగా ఉంది. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించే ఏర్పాట్లు చేస్తు న్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగమే ప్రమాదానికి కారణం..

అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. బైక్ వేగంగా దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని తర్వాత డివైడర్‌రె ఢీకొనడంతో బైక్‌లో ఉన్న ముగ్గురిలో గాయపడిన ఇద్దరూ డివైడర్ గోడకు మధ్యలో పడిపోయారు. బైక్ నడుతున్న యువకుడు మాత్రం డివైడర్‌కు బైక్‌కు మధ్యలో ఇరుక్కుపోయి ఘటన స్థలంలోనే మృతి చెందాడు.

రోహిణి కార్తెలో వానలు..!

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో రోహిణి కార్తె వచ్చిందంటే రోళ్లు పగిలే ఎండలు కాస్తాయని చెబుతుంటారు. ఈ సారి రోహిణి కార్తె రోజే మబ్బులు కమ్ముకుని చల్లగా ఉండడంతో పాటు ఆదివారం సాయంత్రం సూళ్లూరుపేటలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణం చల్లగా ఉంది. సరిగ్గా 6 గంటల సమయంలో కారుమబ్బులు కమ్ముకొని చల్లని గాలులు వీస్తూ తేలికపాటిటి జల్లులు పడడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీనికి తోడు ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందుగానే కేరళను తాకడంతో రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు లేనట్లేనని తెలుస్తోంది.

వాకాటి చంద్రవదనమ్మకు ఘన నివాళులు



తడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పినతల్లి వాకాటి చంద్రవదనమ్మకు పలువురు ప్రముఖులు నివాళుల ర్పించారు. అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మండల పరిధిలోని చేనిగుంటలోని స్వగృహంలో ఆమె మృతి చెందిన విషయం విదితమే. ఆమేరకు ఆదివారం పలువురు ప్రముఖులు ఆమె నివాసానికి వచ్చి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కావలి ఎమ్మెల్యే కావ్యకృష్ణారెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, బీజేపీ, టీడీపీ నాయకులు ఉన్నారు.

అర్ధమాలలో వైభవంగా వేమాలమ్మ జాతర

పెళ్లకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ధమాల గ్రామంలో ఆదివారం వేమాలమ్మ జాతర వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున పొంగళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. జాతర సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు పొలచ్చూరు సుబ్బరామయ్యయాదవ్, నరేంద్రయాదవ్ ఆహ్వానం మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, టీడీపీ సీనియర్ నాయకులు, పేరం రమేష్‌నాయుడు, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు పాపాడి రాజగోపాల్‌రెడ్డి, మదన్‌మోహన్ నాయుడు, వట్టికుండల శేఖర్ నాయుడు, కృష్ణమనాయుడు, సిద్ధులయ్య నాయుడు, పునబాక పోలయ్య తదితరులు వేమాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది, పక్కనబీజేపీ నాయకులు దయాకర్ రెడ్డి, లయన్స్ క్లబ్ చైర్మన్ ఆదిశేషా రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయుర్వేదిక వైద్యం అందుకున్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. ప్రజలకోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులను అందజేసిన తులసి ఆయుర్వేదిక వైద్యశాల నిర్వా హకులు శివప్రసాద్‌ను దయాకర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఆదిశేషారెడ్డి, అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ రాజు, అప్పారావు, లలితరావు, బీజేపీ నాయకులు ఆదినారాయణ రెడ్డి, కిరణ్ గౌడ్ ఉన్నారు.

వైభవంగా కుంభాభిషేక వేడుకలు



కుంభాభిషేక జలాలను తీసుకొస్తున్న ఆలయ చైర్మన్ రవీంద్రరెడ్డి, సభ్యులు

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శ్రీహరికోట రోడ్డు కేఆర్‌పాళెం వద్దనున్న సాయి సన్నిధి సత్సంగ మందిరంలో 30 వార్షికోత్సవ మహా కుంభాభిషేక వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహిం చారు. ఉదయం గోపూజ నిర్వహించి కుంభాభిషేక వేడుకలను ప్రారంభిం చారు. బాబా మందిరంలో సాయిబాబ విగ్రహానికి, గోపుర పై కలశాలకు కుంభాభిషేక జలాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించి మహా పూర్ణాహుతి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాదర్తి రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో కుంభాభిషేక వేడుకలు జరిగాయి.

మద్యం దుకాణాల వద్ద నిబంధనలు పాటించాలి



మద్యం సేవించే దుకాణాన్ని మూయిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సూళ్లూరుపేట, మే 25 (ఆంధ్ర జ్యోతి) మద్యం దుకాణాల వద్ద నిబంధనలు తప్ప కుండా పాటిం చాలని ఎక్సైజ్ సీఐ సురేంద్రబాబు తెలి పారు. ఆది వారం సూళ్లూరుపేటలో మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేశారు. నిబంధలకు విరుద్ధంగా మద్యం షాపుల పక్కనే ఉన్న మద్యం సేవించే షాపులు, కూల్‌డ్రింగ్స్ దుకాణాలను మూయించారు. సమయ పాలన పాటించాలన్నారు. మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరవాలన్నారు. మద్యం దుకాణాల పక్కనే ఉన్న షాపుల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదన్నారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, మే 25 (ఆంధ్రజ్యోతి) : కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సంద ర్భంగా అమ్మవారికి పండితులు పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయా మండలాల నుంచి వచ్చిన భక్తులకు

తేనెటీగల దాడిలో ఆరుగురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం



వాకాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి వాసులు

వాకాడు, మే 25 (ఆంధ్రజ్యోతి) : తేనెటీగలదాడిలో ఆరుగురు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన తూపిలిపాళెం సముద్రతీరంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. తిరుపతికి చెందిన 15 మంది కలసి టెంపోలో తూపిలిపాళెం సముద్రం అందాలను చూసేందుకు వచ్చారు. స్నానాలు ఆచరించి మధ్యాహ్నం సమయంలో సవకచెట్ల మధ్యలో వనభోజనాలు చేస్తుండగా అటు వైపుగా వెళ్తున్న మేకలు తేనెటీగల తుట్టెను కదిలించడంతో ఒక్కసారిగా పర్యాటకులపై దాడిచేశాయి. అప్రమత్తమైన పర్యాటకులు చెట్ల మధ్యలో చెల్లాచెదరుగా పరుగులుతీశారు. కొంతమంది చెట్ల కొమ్మలకు తగిలి కిందపడిపోవడంతో తేనెటీగలు దాడిచేశాయి. కార్తీక్ (8), రిషీత్ (12), సుమంత్ (14), సోమశేఖర్ (15), సింధూర (29), ప్రశాంత్ (30) గాయపడ్డారు. ప్రశాంత్ పరిస్థితి విషమంగా ఉంది. వీరిని వాకాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.